ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
బుధవారం 5 ఫిబ్రవరి 2025 | 5



నరసన్న పెళ్లికి రారండి..



అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవాలు మంగళవారం రాత్రి నుంచి ఆరంభమయ్యాయి. ఆదిదేవుడు లక్ష్మీనరసింహస్వామిని పెండ్లి కొడుకుగా.. అమ్మవారిని పెండ్లి కుమార్తెగాను ముస్తాబు చేశారు.. ఈ క్రతువు తిలకించేందుకు వేలాదిగా భక్తజనం తరలివచ్చారు.. ఇక 7వ తేదీన స్వామి వారి కల్యాణం నిర్వహిస్తారు. ఉత్సవాలు 13వ తేదీ వరకూ జరుగుతాయని ఆలయ అధికారులు తెలిపారు. - వివరాలు 6లో

అడవిలో..అలజడి!

మంగళవారం మధ్యాహ్నం ఆకాశంలో పెద్ద ఎత్తున పొగలు కమ్ముకున్నాయి.. ఎక్కడి నుంచి వస్తున్నాయి.. ఎలా వస్తున్నాయి అనే అలజడి.. ఎక్కడో ఏదో జరిగిపోతోందన్న ఆందోళన.. ఏం జరుగుతుందో తెలియదు.. జాతీయ రహదారిపై కూడా పెద్దఎత్తున పొగలు కమ్ముకున్నాయి. పరిసర ప్రాంతాల ప్రజానీకం చాలామంది అప్పటికే అప్రమత్తమై పోయారు. అయితే చాలాసేపటి తర్వాత రాజమహేంద్రవరానికి కూతవేటు దూరంలో ఉన్న రిజర్వు ఫారెస్టులో మంటలు చెలరేగాయని తెలియడంతో కొంత ఊపిరి పీల్చుకున్నారు.. ఆ తర్వాత మంటలను అదుపుచేశారు. కాగా మంత్రి దుర్గేష్ దహనమైన అడవిని పరిశీలించారు. - వివరాలు 7లో





సమీక్ష నిర్వహిస్తున్న ఆర్డీ నాగనరసింహారావు

మున్సిపాల్టీల్లో పన్ను వసూళ్లు వేగవంతం చేయాలి

మున్సిపల్ ఆర్డీ నాగనరసింహారావు

మండపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న మున్సిపాల్టీల్లో పన్నుల వసూళ్లను నూరు శాతం మార్చి నాటికి పూర్తి చేయాలని మున్సిపల్ ఆర్డీ నాగ నరసింహారావు మున్సిపల్ కమిషనర్లు, రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. మండపేట మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఆయన కోనసీమ జిల్లా మండపేట, రామచంద్రపురం, అమలాపురం, ముమ్మిడివరంతో పాటు కొవ్వూరు, నిడదవోలు మున్సిపల్ కమిషనర్లతో మండపేట మున్సిపల్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. అలాగే మున్సిపల్ శాఖలో పలు విభాగాలకు చెందిన ఉద్యోగులు హాజరయ్యారు. పట్టణాల్లో పారిశుధ్య మెరుగుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆర్డీ వివరించారు.పట్టణాల్లో ఉండే డ్రైన్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవటంతో పాటు ఫాగింగ్ చేయాలని సూచించారు. రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకుని మంచినీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పట్టణాల్లో ఉన్న అనధికార ఫ్లెక్సీలను తొలగించాలని ఆయన పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు. వార్డు సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగులు ప్రతిరోజు విధిగా హాజరు నమోదు చేయాలన్నారు. సచివాలయ ఉద్యోగులు విధుల పట్ల అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. పట్టణాల్లో ప్రజా సమస్యల పరిష్కారంలో మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు అలక్ష్యం చేయకుండా సకాలంలో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆర్డీ కోరారు. ఈ సమావేశంలో మండపేట. రామచంద్రపురం, అమలాపురం, ముమ్మిడి వరం, నిడదవోలు, కొవ్వూరు కమిషనర్లు టీవీ రంగారావు, ఐకేపీ నాయుడు, కేఆర్ఆర్ రాజు, పి.రవివర్మ, టీఎల్‌పీఎస్ఎస్ కృష్ణవేణి, నాగేంద్రకుమార్, మండపేట మున్సిపల్ డీఈఈ శ్రీనివాస్, వివిధ విభాగాలకు చెందిన ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పట్టపగలు రూ.1.50 లక్షలు చోరీ

వార్త..7లో

ఇసుక తవ్వకాలకు అనువైన రీచ్‌లు గుర్తించాలి

కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వశిష్ట, గౌతమి నదుల్లో ఇసుక తవ్వకాలకు అనువైన రీచ్‌లను గుర్తించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. గుర్తించిన రీచ్‌ల అనుమతుల మంజూరు కోసం సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. పట్టా భూముల్లో ఇసుక మేటల తవ్వకాలకు సంబంధించి వచ్చిన దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి అందించిన సర్వే నివేదిక అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కపిలేశ్వరపురం మండలంలో పట్టా భూముల్లో ఇసుక తవ్వకాల అనుమతులు మంజూరు కోరుతూ ఏడు దరఖాస్తులు అందాయన్నారు. వాటిలో ఒక దరఖాస్తుకు సంబంధించిన విస్తీర్ణం కోస్తా తీరప్రాంత జోన్ పరిధిలో ఉందని, మిగిలిన ఆరు దరఖాస్తులకు అనుమతులు ఇవ్వనున్నట్టు చెప్పారు. పి.గన్నవరం మండలంలో ఆరు దరఖాస్తులు రాగా వాటిలో ఐదు దరఖాస్తులకు సంబంధించి విస్తీర్ణం సీఆర్‌జెడ్ పరిధిలో ఉందని, వాటికి అనుమతులు తిరస్కరించామన్నారు. కె.గంగవరం మండలంలో ఒక దరఖాస్తు అందిందని, దానికి అనుమతి ఇస్తామన్నారు. జిల్లాలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఇసుక భవన నిర్మాణ రంగాల డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా చేయాల్సిన అవసరం ఉందని కమిటీ సభ్యులకు సూచించారు. రీచ్‌ల గుర్తింపునకు సమన్వయ శాఖల అధికారుల బృందం క్షేత్రస్థాయిలో పర్యటనలు జరిపి మ్యాప్‌లు జియో కోఆర్డినేటర్స్‌తో సహా అనుమతుల కోసం ప్రయత్నించాలని సూచించారు. గౌతమి నది పరిధిలో నూతనంగా ఏడు లోకేషన్లు గుర్తించామని, వీటిపై ప్రతిపాదనలు సిద్ధం చేసి భూగర్భ గనుల శాఖ అధికారులకు, మైనింగ్ ప్లాన్ పర్యావరణ అనుమతుల కోసం పంపాలన్నారు. వశిష్ట నది పరిధిలో ఇసుక తవ్వకాలకు అనువైన రీచ్‌లను గుర్తించాలన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా ఇసుక తవ్వకాలకు చర్యలు చేపట్టాలన్నారు. అనుమతులు త్వరితగతిన పొందాలని లేనిపక్షంలో జాప్యం చోటు చేసుకుని వర్షాలు వచ్చేనాటికి అనుమతులు వచ్చినా నిరుపయోగం అవుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా భూగర్భ గనుల శాఖ అధికారి ఎల్.వంశీధర్‌రెడ్డి, జిల్లా కాలుష్య నియంత్రణ మండలి కార్యనిర్వాహక ఇంజనీర్ శంకరరావు, డిస్ట్రిక్ట్ జీఐఎస్ అధికారి కుమార్, గనుల శాఖ రియాల్టీ ఇన్‌స్పెక్టర్ టి.సుజాత పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

నిబంధనలు ఉల్లంఘించే ఆక్వా చెరువులను ధ్వంసం చేయాలి

కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ హరిత ట్రిబ్యునల్ నిబంధనలను ఉల్లంఘించినట్టు ధ్రువీకరించిన ఆక్వా రంగ చెరువులను మార్చి నాటికి పూర్తిగా ధ్వంసం చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం రెవెన్యూ, మత్స్యశాఖ, ట్రాన్స్‌కో అధికారులతో సమావేశం నిర్వహించారు. నిబంధనలు ఉల్లంఘించిన చెరువుల ధ్వంసం ప్రక్రియపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మామిడికుదురు మండలంలో 193 చెరువులను గుర్తించగా వాటిలో ఇప్పటి వరకు 47 చెరువులను ధ్వంసం చేసినట్లు చెప్పారు. మలికిపురం మండలంలో 35 చెరువులను గుర్తించగా 19చెరువులను ధ్వంసం చేసినట్టు, 8 చెరువులను ధ్వంసం చేయడానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. సఖినేటిపల్లి మండలంలో 206 చెరువులను గుర్తించగా వీటిని అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి దివ్య కల్యాణోత్సవాలను ముగిసినతర్వాత ధ్వంసం చేయనున్నట్లు చెప్పారు. దశల వారీగా నిబంధనలకు విరుద్ధంగా ఉన్న చెరువుల్లో చేపల హార్వెస్టింగ్ ప్రక్రియ పూర్తి అయిన వెంటనే విద్యుత్ కనెక్షన్లు తొలగించి ధ్వంసం చేయడానికి చర్యలు చేపట్టాలన్నారు. ధ్వంసం చేసిన చెరువుల్లో తిరిగి సాగును పునఃప్రారంభించినట్టయితే అందుకు సంబంధిత మత్స్య అభివృద్ధికి అధికారి పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఇప్పటికే ఆక్వాచెరువుల రైతులకు ఆరు మాసాల గడువు ఇచ్చామని, మార్చి 15నాటికి మొత్తం చెరువులను ధ్వంసం చేయాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, ఆర్డీవో కొత్త మాధవి, జిల్లా మత్స్య శాఖ అధికారి ఎన్.శ్రీనివాసరావు, ట్రాన్స్‌కో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్ శ్రీనివాసరావు, తహశీల్దార్లు శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యాచారి, మత్స్య అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

భూముల రీసర్వేతో భూవివాద రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి

కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వేతో భూవివాద రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. అత్యంత పారదర్శకంగా ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా భూముల రీసర్వే ప్రక్రియ సజావుగా నిర్వహించాలన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో తొలుత భూపరిపాలనా ముఖ్య కమిషనర్ కార్యాలయపు ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎన్.ప్రభాకర్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం రెవెన్యూ, సర్వే ఉద్యోగులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడారు. రైతులతో నేరుగా మాట్లాడి భూముల రీసర్వేపై వారికి గల అనుమానాలు, సందేహాలను నివృత్తి చేస్తూ భూవివాద రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. పొరపాట్లకు తావు లేకుండా రెవెన్యూ రికార్డుల స్వచ్ఛీకరణతో కచ్చితమైన రికార్డులు సిద్ధం చేయాలన్నారు. గ్రామంలోని ప్రతీ రైతుకు వారి పొలాల సర్వే నిర్వహణ విషయాన్ని నోటీసు ద్వారా తెలియచేయాలన్నారు. గ్రామంలోని రైతులతో ఒక వాట్సాప్ గ్రూపును క్రియేట్ చేయించి గ్రామంలో జరిగే రీసర్వే వివరాలను ఎప్పటికప్పుడు పోస్టుచేసి రైతులకు తెలియచేయాలని ఆదేశించారు. ముందుగా పైలెట్ గ్రామాల ప్రాజెక్టులను విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. మ్యూటేషన్లు పరిష్కరిస్తే చాలా వరకు భూ సమస్యలు తగ్గుతాయన్నారు. 250 ఎకరాలను ఒక బ్లాక్‌గా విభజించి రీసర్వే చేపట్టాలన్నారు. ప్రతీ బ్లాక్‌లో ఒక వీఆర్వో, కార్యదర్శి, ఇద్దరు సర్వేయర్ల బృందం పనిచేయాలన్నారు. రెవెన్యూ సదస్సుల అర్జీలను గడువులోగా పరిష్కరించాలన్నారు. సరిహద్దు రాళ్లపై ఉన్న పేర్లను త్వరితగతిన తొలగించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, ఆర్డీవోలు పి.శ్రీకర్, కె.మాధవి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కె.ప్రభాకర్, ఎస్‌డీసీ కృష్ణమూర్తి, చినబాబు, వంశీ తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

ఉమ్మడి జిల్లాలో రోడ్ల మరమ్మతులకు రూ.83.68 కోట్లు


ఆర్అండ్‌బీ ఎస్ఈ జి.కాంత్



పనులను పరిశీలిస్తున్న అధికారులు

పి.గన్నవరం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలకు సంబంధించి కూటమి ప్రవేశపెట్టిన గుంతలు రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమానికి రూ.83.68 కోట్లు మంజూరయ్యాయని ఆర్అండ్‌బీ ఎస్ఈ జి.కాంత్ తెలిపారు. కాకినాడ జిల్లాకు సంబంధించి 398 కిలోమీటర్ల మేర గుంతలు పూడ్చడానికి రూ.29.76 కోట్లు, కోనసీమ జిల్లాకు సంబంధించి 640 కిలోమీటర్ల మేర గుంతలు పూడ్చడానికి రూ.37.71 కోట్లు, తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి 358 కిలోమీటర్ల మేర గుంతలు పూడ్చడానికి రూ.16.21 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాల్లో 75 శాతం పనులు పూర్తయ్యాయని వివరించారు. పి.గన్నవరంలో ప్రధాన సెంటర్‌లో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించి అనంతరం మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలకు సంబంధించి శిథిలావస్థలో ఉన్న 33 ఆర్అండ్‌బీ వంతెనలకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించామని తెలిపారు. కోనసీమలో 11 వంతెనలకు రూ.84.5 కోట్లు, కాకినాడ జిల్లాలో 17 వంతెనలకు రూ.100.4 కోట్లు, తూర్పుగోదావరి జిల్లాలో 5 వంతెనలకు గాను 32.05 కోట్లతో 16వ ఆర్థిక సంఘం నిధులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించినట్లు తెలిపారు. అలాగే సీఆర్ఎఫ్ నిధులకు సంబంధించి దాదాపుగా అన్ని జిల్లాల్లో పనులు పూర్తయ్యాయని మామిడికుదురు మండలంలోని రూ.6 కోట్లతో అప్పనపల్లి కాజ్‌వే నిర్మించాల్సి ఉందన్నారు. పి.గన్నవరంలో సీసీ రోడ్డును పరిశీలించామని 975 మీటర్లు మేర సీసీ రోడ్డు పూర్తయిన తర్వాత 21 రోజులు అనంతరం ట్రాఫిక్‌ను పునరుద్ధరిస్తామని చెప్పారు. పోతవరం వద్ద కుంగిన రహదారి నిమిత్తం 325 మీటర్లు మేర పటిష్ఠ పరుచుటకు ఇప్పటికే మట్టి నమూనాలను సేకరించామని వాటి ఫలితాలు అనంతరం ముందుగా సూచించిన మూడు పద్ధతుల్లో ఒక పద్ధతిని అవలంబించి రహదారి పటిష్ఠంగా ఏర్పాటు చేస్తామన్నారు. ఎస్ఈ వెంట ఆర్అండ్‌బీ ఈఈ బి.రాము, డీఈ జి.రాజేంద్ర, జేఈ మణికుమార్‌లు ఉన్నారు.





అమలాపురం మూడో వార్డులో
స్పీడ్ బ్రేకర్ల తొలగింపు

అమలాపురం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో అమలాపురం పురపాలక సంఘ పరిధిలోని 3వ వార్డులో నిర్వహించిన చర్చా వేదిక దృష్టికి వచ్చిన సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారమవుతున్నాయి. ఇప్పటికే కొన్ని సమస్యలు పరిష్కారమయ్యాయి. మరికొన్ని సమస్యలు పరిష్కార దశలో ఉన్నాయి. వార్డుకు చెందిన వలవల శివరావు తదితరులు స్పీడ్ బ్రేకర్లతో ఎదుర్కొంటున్న ఇబ్బందులను చర్చావేదికలో ప్రస్తావించారు. స్పీడ్ బ్రేకర్లపై మోటారుసైకిల్ వెళ్తే నేరుగా ఆసుపత్రికి వెళ్లాల్సిన పరిస్థితి ఉందని వివరించారు. దీంతో మంగళవారం 3వ వార్డు పరిధిలోని శ్రీచెన్నమల్లేశ్వరస్వామి ఆలయం ఎదురుగా ఉన్న రోడ్డుపై ఉన్న ఎత్తైన స్పీడ్ బ్రేకర్లను వార్డు కౌన్సిలర్, జనసేన మున్సిపల్ ప్రతిపక్ష నేత యేడిద శ్రీను ఆధ్వర్యంలో తొలగించారు. అదే విధంగా తులిప్స్ స్కూల్‌కు వెళ్లే రోడ్డుపై ఉన్న స్పీడ్ బ్రేకర్‌ను తొలగించారు. మిగిలిన సమస్యలను పరిష్కరించేందుకు మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజుతో చర్చిస్తున్నట్టు కౌన్సిలర్ శ్రీను తెలిపారు.



స్పీడ్ బ్రేకర్లను తొలగించిన దృశ్యం

అప్పుల బాధ తాళలేక సూసైడ్ నోట్ రాసి
ఓ కుటుంబం అదృశ్యం

బంధువుల ఆందోళన..పోలీసులకు ఫిర్యాదు

వార్త..మెయిన్‌లో

ప్రతి భక్తునికి కల్యాణాన్ని చూసే భాగ్యం కల్పించాలి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో మాధవి

5 లక్షల మంది వస్తారని అంచనా వేస్తున్నాం
సామాన్య భక్తులకు 1500 కల్యాణ టిక్కెట్లు
విలేకర్ల సమావేశంలో ఆర్డీవో మాధవి

అంతర్వేది, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా పేరొందిన అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి దివ్య తిరు కల్యాణ మహోత్సవాలు మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయని అమలాపురం ఆర్డీవో కె.మాధవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ మంగళవారం చంద్రప్రభ, సూర్యవాహనాల గ్రామోత్సవాలు జరిగాయని, భక్తుల కోర్కెలు తీర్చే శ్రీకరుడు, సర్వశుభాలను ఇచ్చే శుభకరుడు లక్ష్మీనరసింహస్వామి ఆధ్యాత్మిక వైభవానికి ప్రత్యేకంగా ఉన్న అంతర్వేది మహాపుణ్యక్షేత్రంలో ఉత్సవాలు ప్రారంభించామన్నారు. 4వ తేదీ నుంచి 13వ తేదీ వరకు జరిగే ఉత్సవాల నిర్వహణకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నాలుగు దఫాలుగా సమీక్షా సమావేశాలను వివిధ శాఖల అధికారులతో నిర్వహించామన్నారు. అంతర్వేది పుణ్యక్షేత్రానికి సుమారు 5 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేసినట్లు చెప్పారు. 1600 మంది పోలీసులను శాంతిభద్రతల పరిరక్షణకు, 270 మందిని పారిశుధ్య నిర్వహణకు, మొత్తం 1800 మందిని మూడు షిఫ్టులలో విధుల నిర్వహణకు కేటాయించినట్లు చెప్పారు. రెవెన్యూ, పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర శాఖల్లో ఉన్న ఉద్యోగులకు విధుల బాధ్యత అప్పగించినట్లు చెప్పారు. 120 మొబైల్ టాయిలెట్లను భక్తుల కోసం ఏర్పాటు చేశామన్నారు. 50 సత్రాల్లో భక్తులకు ఉచిత అన్నదాన శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. స్వామివారి కల్యాణోత్సవాలను తిలకించేందుకు సామాన్య భక్తులకు అవకాశం కల్పిస్తూ 1500 టిక్కెట్లు కేటాయించినట్లు చెప్పారు. కల్యాణోత్సవాల టిక్కెట్లను 7వ తేదీ ఉదయం ఆలయం వద్ద కౌంటర్‌లో విక్రయిస్తారన్నారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు రవాణా సౌకర్యం, తాగునీరు సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. కమాండ్ కంట్రోల్ రూము నుంచి ఉత్సవాల పర్యవేక్షణ జరుగుతుందన్నారు. మంగళవారం సాయంత్రం ఉండపల్లి, బెల్లంకొండ కుటుంబ సభ్యుల సంయుక్త నిర్వహణలో స్వామి-అమ్మవార్లను పెండికుమారుడు, పెండ్లికుమార్తెలను చేసే తంతు జరిగిందన్నారు. ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, చైర్మన్, ఫ్యామిలీ ఫౌండర్ రాజాకలిదిండి కుమారరాజగోపాలరాజాబహదూర్, ఉత్సవ కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, తహశీల్దార్ ఎం.వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహశీల్దార్ భాస్కర్, ముప్పర్తి నాని, గుబ్బల ఫణికుమార్, సేవా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పనులు ఎప్పటికి పూర్తయ్యేనో..?

జొన్నాడ వంతెనకు మోక్షం లభించకపోవడంపై తీవ్ర అసంతృప్తి



ఆలమూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): డా. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడ వద్ద నేషనల్ హైవేపై జరుగుతున్న ఫ్లైఓవర్ నిర్మాణంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వీడి ఇప్పుడైనా నిర్మాణం ముందుకు సాగుతుందా.. లేక అదే తీరు కొనసాగిస్తారా... అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత మూడునెలలుగా ఈ ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తిగా నిలుపుదల చేశారు. సర్వీసు రోడ్లు సక్రమంగా లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జొన్నాడ, రాజమహేంద్రవరం వద్ద 2023 జనవరిలో కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీ చేతుల మీదుగా శంకుస్థాపనలు జరిగాయి. అయితే జొన్నాడ వద్ద పనులు ప్రారంభించి అదే ఏడాది ఏప్రిల్‌లో మొదలుపెట్టారు. అప్పటి నుంచి నత్తనడకగా పనులు సాగుతున్నాయి. సర్వీసులు సక్రమంగా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా జొన్నాడ నాలుగు రోడ్ల జంక్షన్‌లో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. రాజమహేంద్రవరం నిర్మాణం పూర్తిచేసి ఫ్లైఓవర్ అందుబాటులోనికి వచ్చినప్పటికీ ఇక్కడ మాత్రం పనులు ముందుకు సాగడం లేదు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ కాంట్రాక్టర్, సంబంధిత అధికారులతో జరిపిన చర్చలలో వారం రోజులలో పని మొదలు పెట్టడానికి అంగీకరించడంతో పని ముందుకు సాగుతుందని కొండంత ఆశతో ఎదురుచూస్తున్నారు.

ముందుగా సర్వీసు రోడ్లను నిర్మించాలని వేడుకోలు..

జొన్నాడ ఫ్లైఓవర్ నిర్మాణంతో రోడ్లు అధ్వానంగా మారి వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫ్లైఓవర్ నిర్మాణం మాట ఎలా ఉన్నప్పటికీ ముందుగా సర్వీసు రోడ్లు నిర్మించి అక్కడ జరిగే ప్రమాదాలను నివారించాలని స్థానికులు కోరుతున్నారు. సర్వీసు రోడ్లు నిర్మిస్తే వాహనదారులకు ఇబ్బంది లేకుండా ఉంటుందని వారు కోరుతున్నారు.


సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న శ్రీలక్ష్మీనరసింహస్వామి

ప్రణవస్వరూపా... నరసింహా

వైభవంగా ప్రారంభమైన అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు

తొలిరోజు ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనాలపై స్వామివారికి గ్రామోత్సవం

అంతర్వేది, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): శ్రీకర శుభకర ప్రణవస్వరూపుడైన ఆదిదేవుడు శ్రీలక్ష్మీనరసింహస్వామివారిని పెండ్లి కొడుకుగాను, అమ్మవారిని పెండ్లి కుమార్తెగాను తీర్చిదిద్దే అపూర్వ ఘట్టానికి మంగళవారం అంతర్వేది ఆలయం వేదికైంది. ఆచారం ప్రకారం కేశవదాసుపాలెం గ్రామానికి చెందిన బెల్లంకొండ, ఉండపల్లి కుటుంబాల సంయుక్త నిర్వహణలో సాయంత్రం 6.30గంటలకు ధూపసేవ అనంతరం ముద్రికాలంకరణ నిర్వహించారు. విశేష పూజలందుకున్న స్వామి-అమ్మవార్లను అర్చకులు పెళ్లికి సిద్ధం చేశారు. అర్చకుల వేదమంత్రోచ్చారణల నడుమ నీలమేఘశ్యాముడైన స్వామివారికి బుగ్గన చుక్క పెట్టడంతో పెండ్లి కొడుకుగా దర్శనమిచ్చారు. వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామి-అమ్మవార్లకు బెల్లంకొండ, ఉండపల్లి కుటుంబీకులు ఉంగరాలను సమర్పించారు.


స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తె చేస్తున్న అర్చకస్వాములు

ఎన్నో ఏళ్లగా వంశపారంపర్యంగా రెండు కుటుంబాల సంయుక్త నిర్వహణలో భక్తుల కోలాహలం నడుమ స్వామివారిని పెండ్లి కొడుకు చేస్తున్నారు. ఉభయ కుటుంబాలకు చెందిన ఆడపడుచులు స్వామి, అమ్మవార్లకు హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉండపల్లి, బెల్లంకొండ కుటుంబీకులచే అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి ప్రసాదం స్వీకరించారు. ఆలయ సహాయ కమిషనరు వి.సత్యనారాయణ, ఆలయ ఫ్యామిలీ ఫౌండర్, చైర్మన్ రాజా కలిదిండి కుమారరామగోపాలరాజా బహదూర్, ఉత్సవ సేవా కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, ముప్పర్తి నాని, గుబ్బల ఫణికుమార్, ఆకన బాబ్జీనాయుడు, వనమాలి మూలాస్వామి, పోతురాజు కృష్ణ, పిండి సత్యనారాయణ, వలవల రాంబాబు, రావూరి నాగు, ఉండపల్లి అంజి, భైరా నాగరాజు, పొన్నాల ప్రభ, బెల్లంకొండ, ముప్పర్తి కుటుంబ సభ్యులు, కొపనాతి కృష్ణమ్మ కుటుంబ సభ్యులు, వాహనకారులు పాల్గొన్నారు.

ఆర్తజన రక్షకుడు అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు సూర్యభగవానుడి జన్మదినమైన రథసప్తమి రోజున వైభవంగా ప్రారంభమయ్యాయి. వార్షికంగా బెల్లంకొండ, ఉండపల్లి కుటుంబీకులు తొలి పూజలు చేశారు. స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు జరిపించారు. ఆలయ స్థానాచార్యుడు వింజమూరి రామరంగాచార్యులు సమక్షంలో ప్రధానార్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, పెద్దింటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో శ్రీవారికి వైఖానస ఆగమానుసారం వైష్ణవ సంప్రదాయం ప్రకారం పూజలు జరిగాయి. ఉదయం సుప్రభాత సేవ, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. తిరువారాధన, బాలభోగం, పంచామృత అభిషేకాలు జరిగాయి.


రాజావారి వీధికి రథాన్ని లాగుతున్న భక్తులు


కొబ్బరికాయ కొట్టి రథాన్ని ముందుకు కదిలిస్తున్న చైర్మన్, అధికారులు, వాహనకారులు


ముద్రికాలంకరణలో స్వామి, అమ్మవార్లు

రథ సప్తమిని పురస్కరించుకుని అధిక సంఖ్యలో భక్తులు సముద్ర స్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ ప్రాకార మండపంలో ఉదయం అధిక సంఖ్యలో మహిళలు సూర్య నమస్కారాలు చేశారు. క్యూలైన్లలో భక్తులకు ఉత్సవ సేవకులు, పోలీసులు సేవలు అందిస్తున్నారు.

ఆలయ నిర్మాత కొపనాతి కృష్ణమ్మ నిలువెత్తు విగ్రహానికి ఆలయ చైర్మన్, అధికారులు, ఉత్సవ సేవా కమిటీ, అగ్నికుల క్షత్రియులు పూలమాలలు వేశారు. అనంతరం శ్రీస్వామివారి రథానికి పూజలు చేశారు. గంటలు మోగగా భక్తులు గోవింద నామస్మరణతో రథాన్ని లాగి ఉత్సవాలను ప్రారంభించారు. పల్లిపాలెం గ్రామానికి చెందిన వాహనకారులు, గ్రామస్తులు, భక్తులు రథాన్ని మెరక వీధి (రాజా వారి వీధి)కి చేర్చారు.


కొపనాతి కృష్ణమ్మ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఆలయ సహాయ కమిషనరు సత్యనారాయణ

కల్యాణోత్సవాల్లో భాగంగా తొలిరోజు ఉదయం శ్రీలక్ష్మీనరసింహుడు శృంగవరప్పాడు వాస్తవ్యులు అడబాల వెంకన్నవారి కుమారులతో నిర్మితమైన సూర్య ప్రభ వాహనంపై పుర వీధుల్లో విహరించగా భక్తులు హారతులు ఇచ్చారు.

రాత్రి 8 గంటలకు చంద్రప్రభ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం ఘనంగా జరిగింది. కేశవదాసుపాలెం వాస్తవ్యులు బెల్లంకొండ, ఉండపల్లి, మోరిపోడు వాస్తవ్యులు ముప్పర్తి సుబ్బారావు కుటుంబ సభ్యులచే నిర్మితమైన చంద్రప్రభ వాహనంపై స్వామివారు నృసింహ నామచరణాలు, మిరుమిట్లు గొలిపే విద్యుద్దీపాల నడుమ గ్రామ పురవీధుల్లో ఊరేగారు. స్వామివారికి భక్తులు హారతులు ఇచ్చి కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు.

రథ సప్తమి వేడుకలు

● ఆలయాల్లో ప్రత్యేక పూజలు ● పోటెత్తిన భక్తులు


వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో సూర్యప్రభ వాహనంపై స్వామివారు


సామర్లకోట భీమేశ్వరాలయంలో విశేష పూజల అనంతరం సూర్య నారాయణ స్వామి



సర్పవరం భావనారాయణస్వామి ఆలయంలో పాల పొంగలి తయారుచేస్తున్న మహిళలు, స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

భావనారాయణస్వామి ఆలయంలో...

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే సుప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోన్న కాకినాడ జిల్లా సర్పవరం శ్రీరాజ్యలక్ష్మి సమేత శ్రీభావనారాయణ స్వామి ఆలయంలో మంగళవారం రథ సప్తమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. మాఘ మాసోత్సవాల్లో భాగంగా తిరునాళ్లను పురస్కరిం చుకుని స్వామివారిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. అత్యంత భక్తి శ్రద్ధలతో ముక్తికా సరస్సులో పుణ్యస్నానాలాచరించారు. ముందుగా భావనారాయణస్వామిని దర్శించుకున్న తర్వాత ఈశాన్య దిక్కున ఉన్న లక్ష్మీదేవి, ఆగ్నే యంలో ఆదిశేష భావనారాయణస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు ఆలయ ప్రాంగణంలో సూర్యభగవానుడికి ఎంతో ప్రీతిపాత్రమైన పాల పొంగులను ఆవు పిడకల పొయ్యిలపై తయారు చేసి భక్తితో స్వామివారికి పాల పొంగలి, మొలకెత్తిన పెసలు, రేగుపళ్లు, చెరకు ముక్కలు, అరటి పండ్లను నివేదిస్తూ ఆకాశంలోకి ఎగురవేశారు. వీటిని భక్తులు కొంగులతో ఒడిసిపట్టుకుని ప్రసాదాన్ని స్వీకరించారు. మాఘమాసంలో రథసప్తమి పర్వదినాన సూర్యభగవానుడిని పూజించడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంతో పాటూ ఏడు జన్మల పాపాలు తొలగిపోతాయని, కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. ఉత్సవ కమిటీ చైర్మన్ పుల్ల శ్రీరాములు ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. సుమారు 15 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. సర్పవరం పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో బి.పెద్దిరాజు ఆదేశాల మేరకు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

వాడపల్లి వెంకన్న ఆలయంలో...

ఆత్రేయపురం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేదపండితులు ఫణిశర్మ ఆధ్వర్యంలో సూర్యనమస్కారాలు నిర్వహించారు. అనంతరం సూర్యప్రభ వాహనంపై అలంకృతుడైన శ్రీవారు తీరుమాడవీధులలో విహరించి భక్తులకు అభయాహస్తం అందించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తజన గోవిందనామస్మరణతో స్వామివారి వాహన సేవ ఘనంగా నిర్వహించారు. ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్య చక్రధరరావు పాల్గొన్నారు. అశేష భక్తజనం రథసప్తమి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అలాగే వివిధ గ్రామాల్లో ఇళ్ల వద్ద మహిళలు రథసప్తమి వేడుకలను నిర్వహించారు. చెరుకుముక్కతో పర్వాన్నం వండి చిక్కుడుకాయతో రథం చేసి వేడుకలు నిర్వహించుకున్నారు.

సామర్లకోట భీమేశ్వరాలయంలో...

సామర్లకోట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రథసప్తమి సందర్భంగా కాకినాడ జిల్లా సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలోని సూర్యనారాయణస్వామి ఉపాలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో వేదపండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, కొంతేటి భీమేశ్వరశర్మ, సన్నిధిరాజు వెంకటరమణల వేదమంత్రోచ్చారణల మధ్య స్వామివాని పంచద్రవాలతో అభిషేకించారు. పుష్పార్చన పూజలు చేసి నూతన పట్టు వస్త్రాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. ముందుగా సూర్యనమస్కారములు నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని ప్రసాదాలు స్వీకరించారు.

సమస్యలు పరిష్కరించండి

ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ వినతి


విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఫెడరేషన్ సభ్యులు

ఉండ్రాజవరం/అనపర్తి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పౌల్ట్రీ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని వినతిపత్రం అందజేసినట్టు ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం కాల్ధరి గ్రామానికి చెందిన పౌల్ట్రీ యజమాని కోమట్లపల్లి వెంకటసుబ్బారావు మంగళవారం రాత్రి విలేకర్లకు తెలిపారు. ముఖ్యమంత్రిని ఫెడరేషన్ కమిటీ సభ్యులు మంగళవారం విజయవాడలో కలసి వారి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ సంక్షోభంలో ఉన్న పౌల్ట్రీ పరిశ్రమను ప్రభుత్వం ఆదుకోవాలని, గతంలో వలే రైతులకు చేయూత అందించాలని కోరినట్టు చెప్పారు. అలాగే జొన్న ఇంపోర్టు డ్యూటీని తగ్గించాలని, బ్యాంకులోన్‌కు సంబంధించి వడ్డీ రిబేటు కల్పించాలని ముఖ్యమంత్రిని కోరామని, సమస్యలను పరిష్కరించడానికి చంద్రబాబు సానుకూలంగా స్పందించారని చెప్పారు. కార్యక్రమంలో ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు టి.కుటుంబరావు, జాయింట్ సెక్రటరీ పడాల సుబ్బారెడ్డి, కమిటీ సభ్యులు గన్నమని వెంకటసుబ్రహ్మణ్యం, జి.గంగాధరరావు, పౌల్ట్రీ యజమానులు పాల్గొన్నారు.

రేపు ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక

పిఠాపురం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ బాల బాలికల జట్ల ఎంపిక ఈ నెల 6వ తేదీన ఉదయం 9 గంటల నుంచి కోనసీమ జిల్లా రామచంద్రపురంలో జరుగుతుందని ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు తెలిపారు. 2009 జనవరి 1వ తేదీ తర్వాత పుట్టిన వారు మాత్రమే ఎంపికలో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. ఎంపికకు వచ్చే క్రీడాకారులు ఒరిజనల్ ఆధార్, పుట్టిన తేదీ ధృవీకరణ పత్రాలు తీసుకురావాలని సూచించారు. ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 8 నుంచి 11వ తేదీ వరకూ పిఠాపురంలో జరిగే రాష్ట్ర యూత్ బాస్కెట్‌బాల్ బాలబాలికల చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు.

112 ఏళ్లుగా... అదే రథం!

మండపేటలో ఈనెల 8న ఊరేగింపునకు సిద్ధం



మండపేటలో రథం... రథంపై శిల్పి పేరు, తయారు చేసిన తేదీ దృశ్యాలు

మండపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఏడాది కోసారి మాఘమాసంలో జరిగే శ్రీదేవిభూదేవిసమేత భోగ జనార్దనస్వామివారి కల్యాణ వేడుకలకు కోనసీమ జిల్లా మండపేటలో 112 ఏళ్లు పూర్తిచేసుకున్న పురాతన రథాన్ని సిద్ధం చేశారు. 500 ఏళ్ల చరిత్ర కలిగిన మండపేట జనార్దనస్వామికి ఏటా మాఘమాసంలో కల్యాణం జరగడం తరతరాల నుంచి అనవాయితీగా వస్తోంది. ఉత్సవానికి ఆలమూరు మండలం మడికికి చెందిన శిల్పి తణుకు పురు షోత్తం 1913 ఫిబ్రవరి 17న తయారు చేసిన రథం నేటికీ చెక్కు చెదరకుండా ధృఢంగా ఉంది. 32 అడుగుల ఎత్తు, 13 అడుగుల వెడల్పుతో నిర్మించిన ఈ రథం స్వామివారి రథోత్సవానికి ఏడాదికోసారి మాత్రమే వినియోగిస్తారు. మండపేటలో ఈనెల 8న నిర్వహించే జనార్దనస్వామి రథోత్సవానికి దీన్ని ముస్తాబు చేస్తున్నారు. రథాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన షెడ్డులో ఉంచుతారు. స్వామివారి ఉరేగింపు రథం గుడి నుంచి ప్రారంభమై కలువపువ్వుసెంటరు వర కు సాగుతుంది. ఊరేగింపులో భారీసంఖ్యలో భక్తులు పాల్గొంటారు. రథం లాగేతాళ్లను తాళ్లరేవులో తయారుచేయించారు. అవి కూడా నేటికి చెక్కు చెదరలేదు.

నేటి నుంచి తెలుగు రాష్ట్రాల నాటికల పోటీలు

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలో అపర్ణా కళా తోరణం బత్తుల మురళీకృష్ణ కళా వేదికపై మార్కండేయ నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో 18వ ఉభయ తెలుగురాష్ట్రాల నాటికల పోటీలు బుధవారం రాత్రి నుంచి ప్రారంభం కానున్నాయి. 9వ తేదీ వరకూ జరిగే నాటికల పోటీలకు ఉభయ తెలుగురాష్ట్రాలు నుంచి వివిధ నాటక సమాజాల కళాకారులు వచ్చి నాటికలు ప్రదర్శిస్తారని కళాపరిషత్ అధ్యక్షుడు పడాల రవి తెలిపారు. ఫిబ్రవరి 5వ తేదీ రాత్రి గుంటూరు అమరావతి ఆర్ట్స్ కళాకారులు చిగురు మేఘం నాటికను, విశాఖపట్టణం తెలుగుకళాసమితి కళాకారులు నిశ్శబ్ధమా నీ ఖరీదెంత నాటికను, 6వ తేదీన గుంటూరు జిల్లా తాడేపల్లి అరవిందా ఆర్ట్స్ కళాకారులు విడాకులు కావాలి, కొలకలూరు సాయి ఆర్ట్స్ కళాకారులు జనరల్ భోగీలు, 7వ తేదీన హైదరాబాదు గోవాడ క్రియేషన్స్ కళాకారులు మూల్యం నాటిక, కత్రపాడు ఉషోదయ నికేతన్ కళాకారులు కిడ్నాప్ నాటిక, 9న పొన్నూరు రసఝరి కళాకారులు గురి తప్పిన వేట నాటికను ప్రదర్శిస్తారు. రాత్రి పోటీలు ముగిసిన అనంతరం బహుమతి ప్రదానోత్సవం జరుగుతుందని, 8న పోటీలకు విరామం ఉంటుందని పేర్కొన్నారు.

ఉత్సాహంగా అండర్ 16 టెన్నిస్ పోటీలు

కాకినాడ అర్బన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ డీఎస్‌ఏ మైదానంలో అండర్ 16 ఆలిండియా ర్యాంకింగ్ టెన్నిస్ పోటీలు మంగళవారం రెండో రోజు ఉత్సాహంగా సాగాయి. బాలుర సింగిల్స్ విభాగంలో కార్తీక్(ఏపీ)పై ధుర్వ్ (తమిళనాడు) 6-0, 6-0, విజేత్ (తెలంగాణ)పై తనీష్(తెలంగాణ)6-4, 6-1, ప్రతీక్(ఏపీ)పై ఎస్‌వీ.సూర్య (ఏపీ)6-3,6-7, 6-3, హర్ష (ఏపీ)పై భవేష్(తెలంగాణ)6-0,6-0 స్కోరుతో... బాలికల విభాగంలో చార్విక్లీ(ఏపీ)పై జోషిత (ఏపీ) 6-4, 6-0, రెబ్కా(తెలంగాణ)పై జానకి(ఏపీ) 6-4,6-1,లలిత(ఏపీ)పై గౌరిశ్రీ(తెలంగాణ) 6-1,6-0, తేజశ్రీ(ఏపీ)పై లేఖ్య(ఏపీ) 6-1,6-1 స్కోరుతో గెలుపొందారు. లాన్ టెన్నిస్ సంఘ రాష్ట్ర కార్యదర్శి, చీఫ్ రిఫరీ శివకుమార్ పర్యవేక్షించారు.

దివాన్‌చెరువు రిజర్వు ఫారెస్టు.. దగ్ధం




దివాన్‌చెరువులోని బ్రిడ్జి కౌంటీ వెనుక భాగంలో ఉన్న రిజర్వు ఫారెస్టులో దట్టమైన పొగలతో ఎగసిపడుతున్న మంటలు

- 5 హెక్టార్లకు వ్యాపించిన మంటలు
- మంటలను అదుపు చేసిన అటవీ, అగ్నిమాపక సిబ్బంది

రాజానగరం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువు రిజర్వు ఫారెస్టులో మంగళవారం మంటలు వ్యాపించాయి. జాతీయ రహదారిని ఆనుకుని బ్రిడ్జి కౌంటీ వెనుక ప్రాంతంలోని ఈస్ట్ రిజర్వు ఫారెస్టులో దట్టమైన పొగలతో కూడిన మంటలు ఎగసిపడుతుండడంతో పరిసర గ్రామాల ప్రజలు, జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులు ఆందోళనకు గురయ్యారు. ఫారెస్టులోని జామాయిల్ చెట్లలో ఐదు హెక్టార్ల విస్తీర్ణంలో నేలరాలిన ఆకులు, అలమలతోపాటు పొదలు మంటల్లో కాలిబూడిదయ్యాయి. దీన్ని గ్రౌండ్ ఫైర్ అంటారని, చెట్లకు ఏ నష్టం వాటిల్లలేదని అటవీ, అగ్నిమాపక అధికారులు వెల్లడించారు. గతంలో కూడా ఇదే ప్రాంతంలో అగ్నిప్రమాదం జరిగి రిజర్వు ఫారెస్టు దగ్ధమైంది. అటవీ, అగ్నిమాపక అధికారులు, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక యంత్రాలు ఫారెస్టులోకి ప్రవేశించేందుకు వీలులేకపోవడంతో బ్లోయర్ల సహాయంతో మంటలను అదుపు చేశారు. పరిసర ప్రాంతాల్లోని వారు కాల్చిపడేసిన, సిగరెట్, బీడీ, చుట్టలవల్ల అగ్నిప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని అగ్నిమాపకశాఖ జిల్లా అధికారి మార్టిన్ లూథర్ కింగ్, అసిస్టెంట్ ఫైర్ఆఫీసర్ శ్రీనివాస్ సందర్శించారు.

పరిశీలించిన మంత్రి దుర్గేష్

దివాన్‌చెరువు రిజర్వు ఫారెస్ట్‌లో జరిగిన అగ్నిప్రమాదాన్ని అధికారుల చొరవతో చాలా వరకు అదుపు చేయగలిగామని రాష్ట్ర పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. అగ్నిప్రమాద ప్రాంతాన్ని మంగళవారం ఆయన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ అగ్నిప్రమాదం మానవ ప్రమేయంతోనే జరిగినట్లుగా భావిస్తున్నామన్నారు. అగ్నిమాపక సిబ్బంది త్వరతగతిన వచ్చి మంటలను అదుపులోకి తీసుకువచ్చారన్నారు. సకాలంలో స్పందించడంవల్ల వృక్షాలను కాపాడగలిగామన్నారు.



అగ్నిప్రమాద ప్రాంతాన్ని రాజానగరం ఎమ్మెల్యే బత్తులతో కలిసి పరిశీలిస్తున్న మంత్రి దుర్గేష్

న్యూడ్ ఫొటోలు నెట్‌లో పెడతానని బెదిరించిన వ్యక్తి అరెస్టు

- దఫదఫాలుగా రూ.2.53 కోట్లు కొట్టేసిన స్నేహితురాలి భర్త
- బాధిత యువతి ఫిర్యాదుతో నిడదవోలు పోలీస్‌స్టేషన్‌లో కేసు
- గుంటూరు జిల్లా పెదకాకానిలో నిందితుడి అరెస్టు
- రూ.1.81కోట్ల విలువైన ఆస్తులు సీజ్
- లభ్యం కాని న్యూడ్ వీడియోలు
- ఐదు రోజులు కస్టడీకి ఇవ్వాలని కోర్టును కోరిన పోలీసులు



నిందితుడు నినావత్ దేవనాయక్ అలియాస్ మధు సాయికుమార్

కొవ్వూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆ తల్లి దండ్రులకు ఒక్క కుమార్తె కావడంతో గారాబంగా పెంచారు. సాఫ్ట్‌వేర్ కొలువు రావడంతో హైదరాబాద్ వెళ్లింది. అక్కడ ఆమె స్నేహితురాలు భర్తగా పరిచయమైన యువకుడు ఆ యువతి జీవితాన్ని అగాధంలోకి నెట్టివేశాడు. నాలుగేళ్లుగా వేధిస్తూ ఆ కుటుంబాన్ని అప్పుల్లోకి నెట్టేశాడు. కొవ్వూరు డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం డీఎస్పీ జి.దేవకుమార్ విలేకరులకు వివరాలు వెల్లడించారు.

తమిళనాడుకు చెందిన ఒక కుటుంబం 30 ఏళ్ల కిందట నిడదవోలు వచ్చి స్థిరపడింది. తండ్రి నిడదవోలులో వ్యాపారం చేస్తుండగా తల్లి గృహిణిగా ఉన్నారు. వీరి ఒక్కగానొక్క కుమార్తె బీఎస్సీ కంప్యూటర్ సైన్సు చదువుకుని హైదరాబాద్ విప్రో కంపెనీలో నాన్ ఐటీ ఉద్యోగంలో చేరింది. కూకట్‌పల్లిలోని గాయత్రి ఉమెన్స్ హాస్టల్‌లో చేరింది. హాస్టల్‌లో చిన్ననాటి స్నేహితురాలు కాజా అనూషాదేవి కలిసింది. అనూషాదేవి చిన్నతనంలో గుంటూరు నుంచి తన మావయ్య ఇంటికి నిడదవోలు వచ్చేది. అప్పుడు బాధితురాలికి అనూషాదేవితో పరిచయం ఏర్పడింది.. ఆ పరిచయంతో ఇద్దరూ స్నేహంగా ఉండేవారు. అప్పటికే అనూషాదేవి గుంటూరు రూరల్ ప్రాంతానికి చెందిన నినావత్ దేవనాయక్ అలియాస్ మధు సాయికుమార్‌ని ప్రేమించి కులాంతర వివాహం చేసుకుంది. తన భర్తని యువతికి పరిచయం చేసింది. ముగ్గురూ స్నేహంగా ఉండేవారు.



సీజ్ చేసిన బంగారు ఆభరణాలు, నగదుతో డీఎస్పీ, ఇతర సిబ్బంది

వేరెవరో చేసినట్టుగా నమ్మించి..

కాగా, 2021లో బాధిత యువతి ఉద్యోగం మానివేసి నిడదవోలులోని ఇంటికి వచ్చేసింది. ఆ సమయంలో సాయికుమార్ వేరెవరో ఫోన్ చేసినట్టు బాధితురాలికి ఫోన్ చేశాడు. హాస్టల్‌లో ఉన్నప్పుడు తీసిన న్యూడ్ వీడియోస్ తనవద్ద ఉన్నాయని.. అవి నెట్‌లో పెట్టకుండా ఉండాలంటే కొంత డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఈ విషయాన్ని యువతి స్నేహితుడిగా నమ్మిన సాయికుమార్‌కి చెప్పడంతోన్యూడ్ వీడియోల గొడవను వేరొకరితో సెటిల్‌మెంటు చేసినట్టు నమ్మించాడు. ఆ గొడవలో దెబ్బలు తగిలాయని ఆస్పత్రి బిల్లుకు కొంత డబ్బులు కావాలని అడిగి తీసుకున్నాడు. గుంటూరులో బాయ్స్ హాస్టల్‌పెట్టి మేనేజ్‌మెంటు చేస్తున్నట్టు కొంత డబ్బు తీసుకున్నాడు. ఇలా అవసరం వచ్చినప్పుడల్లా డబ్బులు డిమాండ్ చేసేవాడు. ఇవ్వకపోతే న్యూడ్ వీడియోలు తన వద్ద ఉన్నాయని వాటిని నెట్‌లో పెడతానని బెదిరించేవాడు. దీంతో బాధిత యువతి తన తల్లిదండ్రులకు విషయం చెప్పడంతో వారూ బెదిరిపోయారు. పెళ్లికావాల్సిన అమ్మాయి జీవితం పాడవుతుందని తమవద్దఉన్న డబ్బుతోపాటు ఇల్లు తాకట్టు పెట్టి, తెలిసిన వారి వద్ద కొంత అప్పు చేసి 2021 నుంచి 2025 వరకు రూ.2,53,76,000 ఆన్‌లైన్ ద్వారానే దఫదఫాలుగా సాయికుమార్‌కి పంపారు.

బెదిరింపులు తాళలేక ఫిర్యాదు

ప్రస్తుతం యువతి తల్లిదండ్రులు అద్దె ఇంట్లో ఉంటున్నారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. యువతిని బెదిరించి తీసుకున్న డబ్బుతో సాయికుమార్ విలాసవంతమైన జీవితం గడుపుతున్నాడు. అతడి తల్లిదండ్రులు గుంటూరు మిర్చియార్డులో డైలీ లేబర్ పనిచేసుకుంటున్నారు. ఈ ఏడాది జనవరిలో మరో రూ.14లక్షలు కావాలని డిమాండ్ చేశాడు. అప్పటికే అప్పులు పాలవ్వడంతో ఇవ్వలేకపోయారు. చివరకు చేసేదేంలేక బెదిరింపులకు పాల్పడుతున్న సాయికుమార్‌పై ఫిబ్రవరి 1న నిడదవోలు పోలీస్‌స్టేషన్‌లో యువతి ఫిర్యాదు చేసింది. నిడదవోలు ఎస్‌ఐ జి.ఎస్.ఆర్‌కె పరమహంస నిందితుడు సాయికుమార్‌పై చీటింగ్ కేసు(ఎక్స్‌టార్షన్) భయపెట్టి డబ్బులు తీసుకోవడం(ఐటీ యాక్టు) న్యూడ్ ఫొటోలు, వీడియోలు ఉన్నాయని బెదిరించడంపై కేసు నమోదు చేశారు. ఐటీ యాక్టు ఉండడంతో నిడదవోలు సీఐ పి.వి.జి.తిలక్ కేసు దర్యాప్తును ప్రారంభించారు. యువతి ఇచ్చిన ఆధారాలతో గుంటూరు జిల్లా చిన్నకాకాని చేరుకుని ఈనెల 2న సాయికుమార్‌ని అరెస్టు చేశారు. అతడివద్దనుంచి రూ.75లక్షలనగదు, 938 గ్రాముల బంగారు అభరణాలు, 2.250కిలోల వెండి వస్తువులు, కారు, బుల్లెట్, చిన్నకాకానీలో రూ.40లక్షలతో కొనుగోలు చేసిన అపార్ట్‌మెంటు పత్రాలను తహశీల్దార్, రెవెన్యూ అధికారుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి విలువ రూ.1,81,45,000 ఉంటుందన్నారు. సాయికుమార్‌ని ఈనెల 3న కోర్టులో హాజరుపర్చగా జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో రాజమహేంద్రవరం సెంట్రల్‌జైలుకు తరలించినట్టు డీఎస్పీ తెలిపారు. ఈ కేసులో పూర్తిస్థాయి విచారణ చేపట్టాల్సి ఉండడంతో సాయికుమార్‌ని ఐదు రోజులు పోలీసు కస్టడీకి ఇవ్వాలని కోర్టును కోరామన్నారు. ఈకేసులో ఎటువంటి వీడియోలు లభ్యం కాలేదని తెలిపారు.అయినా ఉన్నాయని బెదిరించి, డబ్బులు వసూలు చేసినట్టు చెప్పారు. అతడి ఫోన్, నెట్‌ను పరిశీలించగా ఎటువంటి వీడియోలు లభించలేదన్నారు. బాధిత యువతి స్నేహితురాలు అనూషాదేవి పాత్రపై ఎటు వంటి ఆధారాలు దొరకలేదన్నారు. అపరిచిత వ్యక్తులు ఫోన్‌చేసినా, వేధింపులకు గురిచేసినా పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. సమావేశంలో కొవ్వూరు, నిడదవోలు సీఐలు పి.విశ్వం, పి.వి.జి.తిలక్, నిడదవోలు, పెరవలి, కొవ్వూరు ఎస్‌ఐలు జి.ఎస్.ఆర్‌కె పరమహంస, ఎం.వెంకటేశ్వరరావు,కె.జగన్మోహనరావు పాల్గొన్నారు.

పార్క్ చేసిన బైక్ నుంచి రూ.1.50లక్షలు చోరీ

- అమలాపురం రూరల్‌లో ఘటన

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): అమలాపురం మండలం పేరూరు వై.జంక్షన్ సమీపంలో మంగళవారం పార్కింగ్ చేసిన మోటారుసైకిల్ నుంచి ఇద్దరు యువకులు రూ.1.50లక్షల నగదును అపహరించుకుని పరారయ్యారు. స్థానికులు, పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం కుతుకులూరుకు చెందిన సత్యనారాయణరెడ్డి ఫైనాన్స్ వ్యాపారంలో భాగంగా అమలాపురం వచ్చారు. వసూళ్లు చేసుకుంటూ పేరూరు వై.జంక్షన్ సమీపంలో అల్పాహారం స్వీకరించేందుకు మోటారుసైకిల్‌ను పార్కింగ్ చేసి హోటల్‌కు వెళ్లారు. ఇంతలో ఇద్దరు యువకులు మోటారుసైకిల్‌పై వచ్చి సత్యనారాయణరెడ్డి మోటారుసైకిల్ డిక్కీలో ఉన్న రూ.1.50 లక్షల నగదును అపహరించుకుని పరారయ్యారు. సమీపంలోని పెట్రోలు బంకు వద్ద సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ వారిని గుర్తించే పరిస్థితి కనిపించలేదు. ఆ యువకులు మోటారుసైకిల్‌పై జాతీయ రహదారిపై రోళ్లపాలెం వైపు వెళ్లినట్టు పోలీసులు గుర్తించారు. సత్యనారాయణరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ వీరబాబు తెలిపారు.

కత్తిపూడిలో చోరీ

- మూడు తులాల బంగారం, రూ.50వేల నగదు అపహరణ

శంఖవరం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా శంఖవరం మండలం కత్తిపూడిలోని యాదవపేటలో ఓఇంట్లోకి మంగళవారం దొంగలు చొరబడి నగదు, బంగారం అపహరించుకుపోయారు. గ్రామానికి చెందిన వీరవల్లి కామేశ్వరరావు కుటుంబం ఇంటికి తాళం వేసి ఆదివారంరాత్రి బంధువుల ఇంటికి వెళ్లారు. మంగళవారం వచ్చి చూసేసరికి ఇల్లంతా చిందరవందరగా ఉందని బాధితులు తెలిపారు. లోపలికి వెళ్లి చూస్తే ఇంట్లోని మూడుతులాల బంగారం, రూ.50వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించామన్నారు. దీనిపై అన్నవరం పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ శ్రీహరి బాబు వచ్చి సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

లలితేశ్వరి హత్యకేసులో మరో నిందితురాలి అరెస్టు

బిక్కవోలు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పందలపాకలో గతనెల 29న కురుపూడి లలితేశ్వరి అనే వివాహితను కేబుల్ వైరును మెడకు బిగించి అతికిరాతకంగా హత్య చేసిన కేసులో ఏ2 గుంతికోలు వరలక్ష్మిని మంగళవారం బిక్కవోలులో అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు అనపర్తి సీఐ సుమంత్ తెలిపారు. ఈ కేసులో ముందుగా వరలక్ష్మి కుమారుడు దుర్గాప్రసాద్‌ను గతనెల 30న అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఈ కేసులో కొందరు నిందితులు లలితేశ్వరిని హత్య చేయడంలో సహకరించారని గ్రామంలోని మహిళలు, కుటుంబసభ్యులు ఈనెల 1న ఆందోళన చేపట్టారు. దీంతో సీఐ విచారణ చేపట్టగా లలితేశ్వరి హత్యకేసులో వరలక్ష్మి పాత్ర కూడా ఉందని తేలడంతో ఆమెను అరెస్టు చేశారు.

నిందితులు పాత నేరస్తులే

- వేలిముద్రల ద్వారా గుర్తింపు
- రాజోలు దోపిడీ కేసును ఛేదించిన పోలీసులు
- పది రోజుల్లోనే ఇద్దరి అరెస్టు
- రూ.40లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి ఆభరణాలతో ఎస్పీ కృష్ణారావు, అడ్మిన్ ఎస్పీ ప్రసాద్

అమలాపురం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పదిరోజుల వ్యవధిలోనే భారీ దోపిడీ కేసును పోలీసులు ఛేదించారు. రూ.40లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రాజోలులో గతనెల 24న జరిగిన భారీ దోపిడీ కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి వారినుంచి రూ.40లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్టు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు మంగళవారం మధ్యాహ్నం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వెల్లడించారు. కేసుకు సంబంధించి వివరాలను వెల్లడించారు.

వేలిముద్రల ద్వారా గుర్తింపు

రాజోలులోని సత్తిరాజువారివీధిలో నివాసం ఉంటున్న విశ్రాంత తెలుగు పండిట్ గెల్లి బాపన్నగుప్తా కుటుంబసభ్యులతో కలిసి గతనెల చివరి వారంలో అన్నవరం వెళ్లారు. అక్కడ ఓం శాంతి సమావేశాల్లో పాల్గొనేందుకు కుటుంబ సభ్యులతో వెళ్లిన సత్తిరాజు గతనెల 24న తిరిగి వచ్చేసరికి ఇంటి తలుపుల తాళాలు పగులకొట్టి 65 సవర్ల బంగారు ఆభరణాలు, ఆరు కిలోల వెండి వస్తువులను అపహరించుకుపోయారు. ఈ ఘటనపై సత్తిరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజోలు పోలీసులు గతనెల 25న కేసు నమోదు చేసి రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్ దర్యాప్తు చేపట్టారు. ఆ సమయంలో క్లూస్‌టీమ్, డాగ్‌స్క్వాడ్, క్రైం పార్టీ సిబ్బంది ఘటనా స్థలాన్ని సందర్శించి వేలిముద్రలు సేకరించారు. వేలిముద్రలతో పాత నేరస్తుల క్రైం సస్పెక్ట్ షీట్ల ఆధారంగా పాత నేరస్తులే ఈ దోపిడీకి పాల్పడ్డట్టు గుర్తించామని ఎస్పీ కృష్ణారావు వెల్లడించారు. పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం హౌసింగ్‌బోర్డు కాలనీ ప్రకాష్‌నగర్‌కు చెందిన గుబ్బల భాస్కర్, అతనికి సహకరించిన నర్సాపురానికి చెందిన కొత్తపల్లి నరేష్‌లను నేరస్తులుగా గుర్తించారు. వీరిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా రాజోలులో జరిగిన నేరాన్ని అంగీకరించినట్టు చెప్పారు. వీటితోపాటు నర్సాపురం పట్టణం, పెనుమంట్ర, పాలకొల్లు టౌన్, పాలకోడేరు, రాజమహేంద్రవరం, అమలాపురం, రావులపాలెం, రాజోలు స్టేషన్ పరిధిలో వీరు 25కు పైగా ఆస్తి నేరాలకు పాల్పడిన గత చరిత్ర కలిగి ఉన్నారని చెప్పారు. నిందితులు అంగీకరించిన మేరకు నర్సాపురం మండలం లక్ష్మణేశ్వరం గ్రామం నక్కావారిపేటలోని కాసువారి నాస్ గార్డెన్‌లో చోరీ సొత్తు అయిన బంగారు, వెండి వస్తువులను ఉంచినట్టు గుర్తించిన పోలీసులు వాటిని మధ్యవర్తుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. విలువైన బంగారం వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని, వీటి విలువ రూ.40లక్షల వరకు ఉంటుందని ఎస్పీ విలేఖరులకు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తామన్నారు. కాగా ఈ కేసును తక్కువ రోజుల్లో అత్యంత చాకచక్యంగా ఛేదించిన రాజోలు పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ కృష్ణారావు అభినందించారు. కొత్తపేట డీఎస్పీ ఎస్.మురళీమోహన్ కేసును ఛేదించిన సీఐ టీవీ నరేష్‌కుమార్, రాజోలు ఎస్‌ఐ వి.రాజేష్‌కుమార్, హెచ్‌సీలు పి.రామ్‌కిశోర్, కె.వెంకటరమణ, పీసీలు పి.కుమార్, బీఎన్‌వీఎస్ రెడ్డి, క్లూస్‌టీమ్ సభ్యులను ఎస్పీ అభినందించి వారికి రివార్డులు అందజేశారు. విలేఖరుల సమావేశంలో అడ్మిన్ ఎస్పీ ప్రసాద్, డీఎస్పీ మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన కళల పరిరక్షణకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి

టీఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు అక్కులప్పనాయక్

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): గిరిజన కళల పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్(టీఎస్ఎఫ్) జాతీయ అధ్యక్షుడు కె.అక్కులప్పనాయక్ అన్నారు. మంగళవారం ఆంధ్రజ్యోతితో ఆయన మాట్లాడారు. గిరిజన సాంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని కోరారు. ఆదివాసీ సంప్రదాయ నృత్యాలు దేశానికే గర్వకారణమని, ముఖ్యంగా థింసా నృత్యం ప్రత్యేకమైనదని అన్నారు. గిరిజన, ఆదివాసీ విద్యార్థులు సంప్రదాయ కలలు ఆచార వ్యవహారాలను కొనసాగించాలని కోరారు. ప్రతిఏటా జాతీయస్థాయి ఆదివాసీల సాంస్కృతిక మహోత్సవాలు తాము నిర్వహిస్తూ ఉంటామన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో రెండోసారి వీటిని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బుధవారం నుంచి ప్రారంభమయ్యే పదో సదస్సులో పలువురు ప్రముఖులు పాల్గొంటున్నారన్నారు.

పిచ్చికుక్క దాడి

16మందికి గాయాలు

ముమ్మిడివరం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగరపంచాయతీ గంటావారివీధి, హైస్కూల్ పక్కనున్న వీధుల్లో ఓ పిచ్చికుక్క స్వైరవిహారం చేసి దొరికినవారిని దొరికినట్టు గాయపరిచింది. సోమవారం 13మంది, మంగళవారం మరో ముగ్గురు పిచ్చికుక్క దాడిలో గాయపడ్డారు.కొందరు ప్రభుత్వాసుపత్రికి వెళ్లగా మరికొందరు ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందారు. స్థానికులు దాన్ని హతమార్చారు.

ప్రకృతి వ్యవసాయంపై శ్రీలంక దృష్టి

- కాకినాడ జిల్లాలో అక్కడి రైతుల పర్యటన
- క్షేత్రస్థాయిలో పంటల పెంపకం తీరు, మార్కెటింగ్ వంటివి పరిశీలన

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఏపీలో ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు నాణ్యమైన దిగుబడులు పొందడంతోపాటు సాగును లాభదాయకంగా చేసుకోవడంపై శ్రీలంక దృష్టిసారించింది. ఇక్కడి సాగు విధానాలను పరిశీలించి అక్కడ అమలు చేయాలని ఆ దేశ వ్యవసాయాధికారులు భావిస్తున్నారు. ఇందులోభాగంగా అక్కడి రైతులు కాకినాడ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు.

శ్రీలంకలోని లంక జాతిక సర్వోదయ శ్రమదాన సంఘమయ(సర్వోదయ ఫౌండేషన్) రైతులకు ప్రకృతి సాగుతోపాటు ఆధునాతన సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించి వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చడంలో శిక్షణ ఇస్తోంది. శ్రీలంకలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా సత్ఫలితాలు సాధించలేకపోయారు. ఈ నేపథ్యంలో ఏపీలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై వారు దృష్టిసారించారు. ఇందుకుగాను రాష్ట్రంలోని కాకినాడ జిల్లాను ఎంపిక చేసుకుని నాలుగురోజుల పర్యటనకు ఆరుగురు రైతులతో కూడిన బృందం ఇక్కడకు వచ్చింది. సోమవారం పెద్దాపురం మండలం జి.రాగంపేటలో జిల్లా రైతుసాధికార సంస్థ ఆధ్వర్యంలో శ్రీలంక రైతులకు శిక్షణఇచ్చారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, మార్కెటింగ్ గురించి వారికి వివరించారు. శిక్షణ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయాధికారి విజయ కుమార్, ప్రకృతి వ్యవసాయం జిల్లాప్రోగ్రామ్ మేనేజరు ఎలియాజర్, రైతు సాధికార సంస్థ ప్రతినిధులు హాజర య్యారు.



గొల్లప్రోలు మండలం దుర్గాడలో పంటలను పరిశీలిస్తున్న శ్రీలంక రైతులు

క్షేత్రస్థాయిలో...

మంగళవారం శ్రీలంక బృందంలోని ఆరుగురు రైతులు ఫౌండేషన్ అగ్రికల్చర్ డెవలప్‌మెంట్ యూనిట్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ ధిలమ్ ఎధిరిమన్నా నేతృత్వంలో గొల్లప్రోలు మండలం దుర్గాడ, పిఠాపురం మండలం పి.రాయవరం గ్రామాల్లో పర్యటించారు. దుర్గాడలో ప్రకృతివ్యవసాయ పద్ధతుల్లో సాగు చేస్తున్న వివిధ రకాల పంటలు, ఏటీఎం పద్ధతిలో 20 సెంట్ల విస్తీర్ణంలోనే 22 రకాలకు పైగా పంటలు సాగు చేయడం పరిశీలించారు.

ప్రత్తిపాడులోను పర్యటన

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): శ్రీలంక దేశీయులు ప్రత్తిపాడు మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయానికి వారు చేరుకుని డ్వాక్రా మహిళలు ప్రకృతి వ్యవసాయ సాగును పరిశీలించారు. మండల ఏపీఎం వెంకట్, మండల సమాఖ్య శ్రీలంక ప్రతినిధులకు వివరించారు. పెద్దిపాలెంలో మహిళా సంఘాల సభ్యులతో కలిసి ప్రకృతి వ్యవసాయ సాగు పరిశీలించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రకృతి వ్యవసాయ కార్యాలయానికి చెందిన ప్రీతి, సరోజ, మండల టీం లీడర్ ముకేష్ వర్మ, ఎం.రామరాజు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి మరో నామినేషన్ దాఖలు

ఏలూరు, ఫిబ్రవరి 4: ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరిజిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు రెండో రోజు మంగళవారం రెండో నామినేషన్ దాఖలైంది. ఏలూరుకు చెందిన ములకల శ్రీనివాస్ నామినేషన్ పత్రాలను కలెక్టరేట్‌లోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ కె.వెట్రి సెల్వి సమర్పించారు. ఒకసెట్ నామినేషన్ సమర్పించిన శ్రీనివాస్‌తో రిటర్నింగ్‌అధికారి ప్రమాణం చేయించారు. కలెక్టర్ వెంట ఏఆర్‌వో, జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు ఉన్నారు. తొలిరోజు సోమవారం కాకినాడకు చెందిన పేపకాయల రాజేంద్ర తొలి నామినేషన్ దాఖలుచేయడం తెలిసిందే.

13న రాజమహేంద్రవరానికి రైల్వే జీఎం అరుణ్ రాక

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ ఈనెల 13న రాజమండ్రి రైల్వేస్టేషన్‌కి ప్రత్యేకరైలులో రానున్నారు. ప్రస్తుతం ఖరారైన పర్యటన షెడ్యూల్ ప్రకారం 12న సాయంత్రం నేరుగా కాకినాడ వెళ్లి బస చేస్తారు. 13న ఉదయం బయలుదేరి తనిఖీ చేస్తూ 11గంటల సమయానికి రాజమండ్రి చేరుకుంటారు. భద్రతాపరమైన అంశాలపై దృష్టి సారిస్తారని తెలుస్తోంది. ఆయనతో 40మందితో కూడిన ఉన్నతాధికారుల బృందం రానుంది.

నేడు శ్రీప్రకాశ్‌లో 'హరివిల్లు'

కాకినాడసిటీ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఈనెల 5న కాకినాడ శ్రీప్రకాశ్ సినర్జీ పాఠశాలలోని సీతానరసింహ క్షేత్రం హాలులో హరివిల్లు అనే ఆర్ట్స్, క్రాఫ్ట్స్ కార్యక్రమం విద్యార్థుల తల్లిదండ్రులు,కళాకారుల సమక్షంలో జరగనుంది. దీనికి ముఖ్యఅతిథులుగా జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, గౌరీ వేముల విచ్చేయనున్నారు.

అద్దెకు ఇల్లు చూసేందుకు వచ్చి.. వృద్ధురాలి మెడలో గొలుసు అపహరణ

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఇల్లు అద్దెకు కావాలని వచ్చి ఇంటి యజమాని వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు అపహరించుకుపోయిన సంఘటన రామచంద్రపురం పట్టణంలో గణేష్‌నగర్‌లో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గణేష్‌నగర్‌లో కడియాల పార్వతి తన భర్తతో కలిసి తన ఇంట్లో నివసిస్తోంది. పక్క పోర్షన్ అద్దెకు ఇచ్చేందుకు టులెట్ బోర్డు ఏర్పాటు చేసింది. మంగళవారం ఉదయం ఒక యువకుడు ముఖానికి మాస్క్ పెట్టుకుని ఇల్లు అద్దెకు కావాలని ఇల్లు చూసుకుంటానని పార్వతి వద్దకు వచ్చాడు. తాళం తీయగా అతడు ఇంట్లోకి ప్రవేశించాడు. మొదటి రెండు గదులు చూసి ఆఖరు గది కిచెన్‌లోకి వెళ్లాడు. ఎవరూ లేరని నిర్ధారించుకున్న ఆగంతకుడు వృద్ధురాలి మెడలోని 4 కాసుల బంగారు గొలుసు లాక్కున్నాడు. పీకపట్టుకుని లాగడంతో వృద్ధురాలు షాక్‌కు గురైంది. ఆగంతకుడు అక్కడినుంచి పరారయ్యాడు. షాక్ గురైన వృద్ధురాలిని రామచంద్రపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. సీఐ ఎం.వెంకటనారాయణ ఆమెను విచారణ జరిపి సంఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్‌ఐ ఎస్.నాగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనాస్థలాన్ని డీఎస్పీ బి.రఘువీర్ పరిశీలించారు. బాధితురాలి దగ్గర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సీఐ ఎం.వెంకటనారాయణ, ఎస్‌ఐ సత్యనారాయణ ఉన్నారు

'సౌత్‌జోన్ పోటీల్లో నన్నయ ఖ్యాతి చాటాలి'

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు క్రమశిక్షణతో తమ ప్రతిభను కనబరచాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. అనంతరం జరిగే సౌత్‌జోన్ పోటీల్లో నన్నయ విశ్వవిద్యాలయం ఖ్యాతిని చాటాలని పిలుపునిచ్చారు. నన్నయ విశ్వవిద్యాలయం విద్యకళాశాల ఆధ్వర్యంలో రెండురోజులుపాటు నిర్వహిస్తున్న అంతర్ కళాశాలల హ్యాండ్ బాల్ టోర్నమెంట్, జట్టు ఎంపికలను వీసీ టాస్ వేసి మంగళవారం ప్రారంభించారు. టోర్నమెంట్‌ను నాకౌట్ కం లీగ్ పద్ధతిలో నిర్వహించారు. దీనికి తూర్పుగోదావరి హ్యాండ్‌బాల్ రిఫరీ బోర్డు చైర్మన్ పి.దిలీప్‌కుమార్, ఇతర రిఫరీలు పాల్గొన్నారు. ప్రతిభ కనబరచిన క్రీడాకారులు తమిళనాడులోని సేలంలోని పెరియార్ విశ్వవిద్యాలయంలో జరిగే సౌత్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల టోర్నమెంట్‌లో పాల్గొంటారు. విద్యకళాశాల ప్రిన్సిపాల్ కె.సుబ్బారావు, పరిశీలకుడు వీఎస్ దేవానంద్, ఎంపిక కమిటీ సభ్యులు పి.శ్రీను, సీహెచ్ అంజిబాబు, వ్యాయామ విద్య అధ్యాపకుడు బి.రామ్‌గోపాల్ పాల్గొన్నారు.



టాస్ వేసి పోటీలను ప్రారంభిస్తున్న వీసీ శ్రీనివాసరావు

అమలాపురం

స్వామివారి ఆలయంలో పీవీకే పూజలు

అంతర్వేది, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి కేంద్ర నీతిఆయోగ్ మెంబర్ పీవీకే సరస్వత్ కుటుంబ సమేతంగా విచ్చేశారు. స్వామివారి అంతరాలయంలో దర్శనం నిర్వహించి వేదపండితులచే మహాదాశీర్వచనం జరిపించారు. అనంతరం స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందించారు.

ఉచిత పశువైద్య శిబిరం

అమలాపురం రూరల్, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): వన్నెచింతలపూడిలో పశు వైద్యాధికారిణి డాక్టర్ పూర్ణిమానాగలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పశువైద్య శిబిరాన్ని మంగళవారం పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ ఎల్.విజయారెడ్డి ప్రారంభించారు. పశువైద్యాధికారులు డాక్టర్ హెప్సిబా, తేజ, సిబ్బంది మౌనిక, రమణ, సురేష్‌పాల్గొన్నారు.

ఓఎన్జీసీపై పోరుకు ఓడలరేవు గ్రామస్తుల అల్టిమేటం



ధర్నా చేస్తున్న దెందుకూరి, ఓడలరేవు గ్రామస్తులు

అల్లవరం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కృష్ణా-గోదావరి బేసిన్ పరిధిలో 30ఏళ్లుగా అపారమైన చమురు నిక్షేపాలు తరలించుకుపోతూ ఓఎన్జీసీ ఓడలరేవు గ్రామాభివృద్ధి, స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించడం లేదని సమావేశం ఆరోపించింది. ఓడలరేవు గ్రామస్తులకు ఇచ్చిన హామీ ఓఎన్జీసీ అమలు చేయకుంటే ఈనెల6 నుంచి ఓడలరేవులో ఓఎన్జీసీ ప్లాంటు కార్యకలాపాలు అడ్డుకుని నిరవధిక ధర్నా చేపడతామని గ్రామస్తులు అల్టిమేటం జారీ చేశారు. టెక్నికల్ అర్హతలున్నా స్థానికులకు కాకుండా ఇతర ప్రాంతాల వారికి ఉద్యోగాలిస్తున్నారని ఆరోపించారు. ఓడలరేవులో రైతుల నుంచి 470ఎకరాలను భూమిని ఓఎన్జీసీ సంస్థ తీసుకుని ఇంకా కొంత మందికి సొమ్ములు ఇవ్వలేదని, సీఎస్సార్ నిధులను సక్రమంగా ఖర్చు చేయలేదని సమావేశం ఆరోపించింది. దేశంలో ఓడలరేవు అతిపెద్ద గ్యాస్ టెర్మినల్ అని, రోజుకు 15లక్షల క్యూబిక్ మీటర్ల గ్యాస్ తరలించుకుపోతూ అభివృద్ధిని విస్మరించిందని పలువురు దుయ్యబట్టారు. ఓఎన్జీసీ లిఖితపూర్వక హామీ ఇవ్వకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని పలువురు హెచ్చరించారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్, టీడీపీ మండల అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు మాట్లాడుతూ ఓఎన్జీసీ భారీ వాహనాల వల్ల రోడ్లు దెబ్బతిన్నాయని, ప్రొమోటెక్ కంపెనీలో 66 పోస్టులు ఇస్తామని, తక్కువ మందిని చేర్చుకుంటే ఊరుకునేది లేదని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు దృష్టికి తీసుకువెళతానని అన్నారు. అనంతరం ఓఎన్జీసీకి వెళ్లే రోడ్డులో గ్రామస్తులు, కూటమి నాయకులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమాల్లో కొల్లు విష్ణుమూర్తి, పినపోతు రామకృష్ణ, నాతి లెనిన్‌బాబు, కలిగితి సత్యనారాయణ, కొప్పాడి వెంకటరామకృష్ణ, గండమేను శ్రీను, మంతెన సురేష్‌రాజు, పిండి గణపయ్య, పెచ్చెట్టి రామకృష్ణ, నల్లా రాము, కడలి విజయ్ పాల్గొన్నారు.

సాగునీటి వ్యవస్థ పూర్తిస్థాయిలో ప్రక్షాళన

- లొల్ల లాకులు ఆధునికీకరించాలి
- శివారు భూములకు నీరందించాలి
- ప్రాజెక్టు కమిటీ సమావేశంలో తీర్మానాలు



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ గుబ్బల శ్రీనివాస్

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): సాగునీటి వ్యవస్థలను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాల్సిన పరిస్థితి ఉందని గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ అన్నారు. రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు సక్రమంగా అందించడంతో పాటు డ్రైనేజీ వ్యవస్థను పూర్తిస్థాయిలో మెరుగుపరిచేందుకు అవసరమైన అనేక అంశాలపై చర్చించారు. ప్రాజెక్టు కమిటీ తొలి సమావేశం మంగళవారం సమనసలోని గోదావరి సెంట్రల్ డివిజన్ కార్యాలయంలో శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ధవళేశ్వరం ఇరిగేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ గోపీనాథ్ హాజరయ్యారు. తొలుత శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రాజెక్టు కమిటీకి ఎన్నికైన సభ్యుల్లో ఒకరిద్దరు మినహా అందరూ కొత్తవారేనన్నారు. ప్రాజెక్టు కమిటీ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన పనులు విధివిధానాలపై సభ్యులకు వివరించాలని కోరగా త్వరలోనే ప్రభుత్వం తరపున అన్నిస్థాయిల్లోను సాగునీటి సంఘాలకు సంబంధించి శిక్షణ తరగతులు నిర్వహిస్తారని ఎస్ఈ వివరించారు. ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ కరుటూరి నరసింహారావు మాట్లాడుతూ సెంట్రల్ డెల్టాకు లొల్ల లాకులు ఆయువు పట్టు వంటివని, అటువంటి లాకులు శిథిలావస్థకు చేరుకున్నాయని వివరించారు. లొల్ల లాకులను పూర్తిస్థాయిలో ఆధునికీకరించాలన్నారు. అంతేకాకుండా పంట కాల్వలకు సిమెంట్ సైడ్ వాల్స్ నిర్మించాల్సిన అంశంపై చర్చించారు. ఆలమూరు మండలం చింతలూరు ప్రాంతంలో పంటలు ఎండిపోతున్న పరిస్థితిని గుర్తించి ఆ పరిస్థితి మన ప్రాంతంలో రాకుండా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ప్రధానంగా లస్కర్ల కొరత, శివారు ప్రాంతాలకు సాగునీరు అందని పరిస్థితులపై డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు దాట్ల వెంకటరాజగోపాలరాజు, రాజులపూడి వెంకటేశ్వరరావు (బీముడు), ఆకాశం శ్రీనివాస్‌లు సమావేశంలో చర్చించారు. డ్రైనేజీ డీఈ ఎంవీవీ కిశోర్ మాట్లాడుతూ సెంట్రల్ డెల్టా పరిధిలో ఉన్న పదకొండు మేజర్ డ్రైన్లు ప్రాజెక్టు కమిటీ పరిధిలోకి వస్తాయని, 21 మీడియం డ్రైన్లు డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు, 143 మైనర్ డ్రైన్లు సాగునీటి సంఘాల పరిధిలోకి వస్తాయని వివరించారు. సమావేశంలో ప్రస్తుత పంట సీజన్‌లో సాగునీటి ఎద్దడి నివారణ కోసం డ్రైన్లలో క్రాస్ బండ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయడంతో పాటు పంట కాల్వల్లోకి డ్రైన్‌నీరు మళ్లింపునకు అనుమతులు తీసుకోవాలని నిర్ణయించారు. లస్కర్ల వేతనం, తదితర అంశాలపై తీర్మానించారు. కాల్వలు, డ్రైన్లపై ఆక్రమణలు గుర్తించడానికి డ్రోన్లతో సర్వే నిర్వహించాలని, ఇందుకోసం పైలెట్ ప్రాజెక్టుగా రాజోలు నియోజకవర్గాన్ని ఎంపిక చేసేందుకు తీర్మానించారు. సెంట్రల్ డెల్టా ప్రధాన నీటి వనరు అయిన లొల్ల లాకులను పునర్నిర్మించడానికి తీర్మానించారు. సమావేశంలో ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.శ్రీనివాసరావు, డ్రైన్స్ డీఈ ఆర్.నాగార్జున, ఇరిగేషన్ డీఈ నాగేంద్రకుమార్, నాగార్జునరావుతో పాటు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు పినిశెట్టి వెంకటస్వామి, దంగేటి వెంకటరెడ్డినాయుడు, చిలువూరి సుబ్బరాజు, కాకర శ్రీనివాస్, చవల జగన్నాథం తదితరులు పాల్గొన్నారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీ తొలి సమావేశానికి హాజరైన శ్రీనివాస్‌ను రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుమోగుల పెద్దకాపు, చాగంటి స్వామి తదితరులు అభినందించారు.

కొత్త కలుపు మందు ప్రయోగం



కొత్త కలుపు మందు అందిస్తున్న ఏరువాక కేంద్ర శాస్త్రవేత్తలు

మామిడికుదురు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): వరి పొలాల్లో వ్యాపించే కలుపు మొక్కల నివారణకు కొత్త కలుపుమందుతో ప్రయోగాన్ని నిర్వహిస్తున్నట్టు ఏరువాక కేంద్ర శాస్త్రవేత్త ఎం.నందకిశోర్, జిల్లా వ్యవసాయ వనరుల కేంద్ర అధికారి జి.మనోహర్ పేర్కొన్నారు. మంగళవారం వారు నగరంలో, రాజోలు మండలం కడలి గ్రామాల్లోని వరి పొలాలను పరిశీలించారు. పొలాల్లో సాగునీటి ద్వారా వ్యాపించే కలుపు మొక్కలు, నీటి తామర, సాల్వేనియా తదితర కలుపులను ప్రారంభ దశలో అగ్గి తెగులు, జింక్ లోపం, కాండం తొలిచే పురుగు నివారణకు రైతులకు సూచనలిచ్చారు. వరిలో కలుపు నివారణకు నాటిన 30నుంచి 35రోజులైతే డిసోడియం సాల్ట్ ఎకరాకు 400గ్రాములు పిచికారీ చేయాలన్నారు. పి.గన్నవరం వ్యవసాయ ఉపసంచాలకుడు ఎస్వీవీ రామ్మోహనరావు, మండలవ్యవసాయాధికారి డి.మృదుల, ఏఈవో శివరామకృష్ణ, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

నాలుగు తాటాకిళ్లు దగ్ధం



అమలాపురం రూరల్ ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఈదరపల్లి బొంతువారిపేటలోని రామాలయం సెంటర్‌లో మంగళవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో నాలుగు తాటాకిళ్లు దగ్ధమయ్యాయి. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా జరిగిన ప్రమాదంలో బాధిత కుటుంబాలు కట్టుబట్టలతో మిగిలాయి. రూ.8లక్షలు ఆస్తి నష్టం ఏర్పడింది. అమలాపురం అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను అదుపు చేయడంతో పెనుప్రమాదం తప్పింది. రామాలయం సెంటర్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో గూటం ఇంద్ర, కుంచే మరియమ్మ, దాకే మంగాయమ్మ, మంగం సుజాతలకు చెందిన రెండు తాటాకిళ్లు, రెండు రేకుల షెడ్ల ఇళ్లు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. ఈప్రమాదంలో రెండు గ్యాస్ సిలిండర్లు పేలడంతో స్థానికులు ఒక దశలో మంటలు అదుపు చేసేందుకు భయపడ్డారు. చివరకు మిగిలిన రెండు గ్యాస్ సిలిండర్లను బయటికి తీసుకువచ్చి తర్వాత మంటలను అదుపు చేశారు. గ్రామసర్పంచ్ రాయుడు వరలక్ష్మి తక్షణ సాయం కింద తన వంతుగా ఒక్కో కుటుంబానికి రూ.5వేలు చొప్పున అందజేశారు. బాధిత కుటుంబాలకు స్థానిక సచివాలయంలో వసతి కల్పించడంతో పాటు భోజన సదుపాయాలు కల్పిస్తున్నట్టు కార్యదర్శి కోడూరి వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అడపా సత్తిబాబు, ఉపసర్పంచ్ పోలిశెట్టి వీరబాబు, మల్లవరపు ప్రసాద్, పంచాయతీ తరపున డి.నాగబాబు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ప్రమాద నష్టాన్ని అగ్నిమాపక సిబ్బంది అంచనా వేస్తున్నారు. ఈ ప్రమాదంలో బండి సత్యనారాయణకు చెందిన బిల్డింగ్ దెబ్బతింది.

ఉత్సవాల్లో మద్యం, మాంసం నిషేధించాలి

అంతర్వేది, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది పుణ్యక్షేత్రంలో బీజేపీ సఖినేటిపల్లి మండల అధ్యక్షుడు పోతురాజు సురేష్ కార్యాలయంలో పార్టీ నాయకుల సమావేశం మంగళవారం జరిగింది. జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి మాలే శ్రీనివాసనగేష్, డ్రైనేజీ సెల్ కన్వీనర్ చెంపాటి శివరామకృష్ణంరాజు మాట్లాడుతూ శ్రీలక్ష్మీనరసింహస్వామివారి తీర్థ మహోత్సవాల్లో మద్యం, మాంసం విక్రయాలు నిషేధించాలని డిమాండ్ చేశారు. దేవాలయానికి అనుకుని 30ఎకరాల స్థలంలో మెరక చేసి తీర్థానికి సంబంధించిన ఏర్పాట్లు చేయాలని కోరారు. పట్టాపు సూర్యప్రకాశరావు, ఉద్దరాజు రామకృష్ణంరాజు, పోతురాజు గణపతిరావు, యెనుముల సుబ్బారావు, ఆరేటి రామచంద్రరావు, పోతురాజు నాగరాజు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

మలికిపురం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): విశ్వేశ్వరాయపురం ఎస్సీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా చవ్వాకుల సుందరరావు, కార్యదర్శిగా పెయ్యల చిట్టిబాబు ఎన్నికయ్యారు. కోశాధికారిగా కొంబత్తుల శ్రీను, ఉపాధ్యక్షుడిగా నేతల ఫ్రాంచిస్‌రాజు, సహాయ కార్యదర్శిగా డి.నాగరాజు, గౌరవాధ్యక్షుడిగా జిల్లెళ్ల బాబూప్రసాద్, సలహాదారులుగా దొండపాటి రాంబాబు, కారుపల్లి ఏసురత్నం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రథసప్తమి వేడుకలు

ముమ్మిడివరం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో రథసప్తమి వేడుకలు జరుపుకున్నారు. ఉదయాన్నే రేగు పండ్లు, జిల్లేడు ఆకులను తలపై ఉంచి స్నానాలు ఆచరించారు. సూర్యభగవానుడికి పిడకలపై క్షీరాన్నాన్ని వండి చిక్కుడు ఆకుల్లో ఆ ప్రసాదాన్ని నైవేద్యంగా సమర్పించారు. చెరకుగెడ, రేగుపండ్లను స్వామివారికి సమర్పించారు. చిక్కుడుకాయలతో రథాన్ని తయారు చేసి దాంట్లో ప్రసాదాన్ని ఉంచి సూర్యభగవానుడికి సమర్పించి పూజలు జరిపించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ రాజుపాలెంలోని శ్రీభావనారాయణస్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, నాయకులు తాడి నరసింహారావు, చెల్లి అశోక్, చింతకింద రామకృష్ణ, నడింపల్లి శ్రీనివాసరాజు, నడింపల్లి కుమారరాజు, దాట్ల బాబు, దొమ్మేటి రమణ కుమార్, యాళ్ల ఉదయ్ పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం, (ఆంధ్రజ్యోతి): రథసప్తమి పూజలు మంగళవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆలయాల్లో ఉదయం పూజలు నిర్వహించారు. విలసవిల్లి బసవయ్యఅగ్రహారంలో జరుగుతున్న నక్షత్ర నవగ్రహపూర్వక మహాసౌరయాగంలో రథసప్తమి పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆదిత్యహృదయ పఠనం, సూర్యనమస్కారాలు, సూర్యారాధన కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మున్నంగి రామకృష్ణశర్మ పర్యవేక్షణలో పూజాకార్యక్రమాలు జరిగాయి.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): రథసప్తమి వేడుకలను వాడవాడలా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. సూర్యభగవానుడికి సూర్యనమస్కారాలు, వేదపారాయణం, నవగ్రహ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

అల్లవరం,(ఆంధ్రజ్యోతి): కొమరగిరిపట్నం కాశీవిశ్వేశ్వరాలయం వద్ద, బెండమూర్లంక రామాలయం వద్ద నుంచి రథోత్సవ యాత్రలు మంగళవారం జరిగాయి. కొమరగిరిపట్నం శివాలయం వద్ద సీతారాముల రథోత్సవాన్ని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, మెట్ల కుటుంబీకులు తాడు లాగి ప్రారంభించారు. బెండమూర్లంకలో రామాలయం వద్ద రథోత్సవం నిర్వహించారు.

కోకో పంటతో అధిక ఆదాయం



కోకో పంటపై మాట్లాడుతున్న అధికారులు

అంబాజీపేట, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటల్లో కోకో పంటను సాగు చేయడం ద్వారా నాణ్యమైన దిగుబడులతో పాటు అధిక లాభాలు పొందవచ్చునని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాంటేషన్ మేనేజ్‌మెంట్ అధికారులు డాక్టర్ నాని రసూల్, డాక్టర్ నరేంద్రన్ సూచించారు. స్థానిక వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రంలో కోకో సాగు పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కోకో సాగు పద్ధతులు, ఆరబెట్టడం, ప్రాసెసింగ్, మార్కెట్ ధరలు, ఉద్యాన పంటల్లో అంతర పంటగా ఇతర ప్రాంతాల్లో కోకోను అభి వృద్ధి చేయాలని సూచించారు. కోకో పంటను సాగు చేస్తే నాలుగేళ్లలో మంచి ఆదాయం సాధించవచ్చన్నారు. అనంతరం క్షేత్రస్థాయిలో కోకో పంటపై వివరించారు. ఉద్యాన పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు, విశ్రాంత నాబార్డు ఏజీఎం కేఎస్ఎస్ సోమయాజులు, ఉద్యాన శాఖాధికారి ఎం.శైలజ పాల్గొన్నారు.

మెలకువలు పాటించాలి

రాజోలు, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): రైతులు వరి పంటలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు, మెలకువలు పాటించాలని మండల వ్యవసాయాధికారి వై.మధుకుమార్ అన్నారు. చింతలపల్లిలో మంగళవారం రైతు సేవా కేంద్రంలో ఐఎన్జీజీపీ పొలం బడి కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ మట్టా ప్రసన్నకుమారి అధ్యక్షతన నిర్వహించారు. వీఆర్వో, వీహెచ్‌ఏలు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

హెల్మెట్లు ధరిస్తాం..

అమలాపురంరూరల్, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): మీకుటుంబానికి మీరే దిక్కు. మీకో దండం పెడతా హెల్మెట్లు పెట్టుకోండని మోటారు సైకిలిస్టులను తాలూకా సీఐ ప్రశాంత్‌కుమార్ వేడుకున్నారు. మంగళవారం భట్నవిల్లి జాతీయ రహదారిపై హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారిని పట్టుకుని విధిగా హెల్మట్ ధరిస్తామని ప్రతిజ్ఞచేయించారు.

రహదారి భద్రతా మాసోత్సవాలు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం ఏఎస్ఎన్ కళాశాల విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులతో రహదారి భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. సహాయ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ కాశీ విశ్వేశ్వరరావు, కళాశాల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

పనులు ప్రారంభం

కాట్రేనికోన, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కందికుప్ప వద్ద ఆర్‌అండ్‌బీ రహదారి ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి. 100మీటర్ల మేర రోడ్డు వేస్తున్నారు. రూ.20లక్షలతో పనులు జరుగుతున్నాయి. ఈపనులను ఆర్‌అండ్‌బీ ఏఈ ఆశ్రిత మంగళవారంపర్యవేక్షించారు.

విధులకు ఆటంకం పరిచిన వ్యక్తులపై కేసు

పి.గన్నవరం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సిబ్బంది విధులకు ఆటంకం కల్గించిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.శివకృష్ణ తెలిపారు. మానేపల్లి శివారు పెదకందాలపాలెంలో వైనతేయ నదీపాయ చెంతనే ఉన్న లంకభూముల్లో పృథ్వీ అనుచరులతో తువ్వ, ఇసుక మట్టిని తరలించేందుకు ఎక్స్‌కవేటర్‌తో వచ్చారు. దీంతో ఆర్ఐ, మానేపల్లి వీఆర్వోలను పోలీసు సిబ్బందితో ర్యాంపు లోకి వెళ్లాలని తహశీల్దార్ ఆదేశించారు. ర్యాంపులోకి చేరు కున్న రెవెన్యూ, పోలీసు సిబ్బంది ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకుని బయటకు తీసుకువస్తుండగా పృథ్వీ, తన అనుచరులు అడ్డుకుని విధులకు ఆటంకంపరిచారు.వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాలిక నిశ్చితార్థాన్ని అడ్డుకున్న ఐసీడీఎస్ సిబ్బంది

పి.గన్నవరం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మానేపల్లి శివారు ఇందిరాకాలనీలో బాలికకు బంధువులు నిశ్చితార్థ వేడుక నిర్వహిస్తుండగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో స్థానిక వీఆర్వో వి.సత్యనారాయణ, ఆరోగ్య సిబ్బంది అడ్డుకున్నారు. బాలికకు 18ఏళ్లు నిండే వరకు వివాహం చేయరాదని కౌన్సిలింగ్ ఇచ్చి రాతపూర్వకంగా అంగీకార పత్రం తీసుకున్నారు. మహిళా పోలీసు కె.విజ్ఞానజ్యోతి, సిబ్బంది పి.జోత్న, పీసీహెచ్ లక్ష్మి, ఎం.సురేష్, జి.మహాలక్ష్మి, ఎన్.పార్వతిఅరుణ పాల్గొన్నారు.

ఉత్సవాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

అంతర్వేది, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పది రోజుల పాటు జరిగే స్వామివారి కల్యాణోత్సవాల్లో దేవస్థానం పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడమే ముఖ్య ఉద్దేశమని ఉత్సవ కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ అన్నారు. ప్రతీ భక్తుడు స్వామివారి కల్యాణాన్ని తిలకించి తీర్థ మహోత్సవాల్లో పాల్గొని దేవస్థానం పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. తీర్థ మహోత్సవాల్లో 342మంది పారిశుధ్య కార్మికులు విధులు నిర్వహిస్తారన్నారు. వారికి మొదటిరోజు ఆలయ ప్రాంగణంలో తీర్థ మహోత్సవాలపై ప్రత్యేక సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, ముప్పర్తి నాని, గుబ్బల ఫణికుమార్, కూటమి శ్రేణులు, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ర్యాంపులు పరిశీలించిన జేసీ

పి.గన్నవరం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఇసుక, తువ్వ మట్టి ర్యాంపులను పరిశీలన చేశామని, సంబంధిత శాఖల నివేదిక కోరినట్లు జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి తెలిపారు. మండలంలోని పలు ఇసుక, తువ్వమట్టి ర్యాంపులను మంగళవారం ఆమె పరిశీలించి అనంతరం మాట్లాడారు. ర్యాంపుల్లో ప్రస్తుత పరిస్థితులపై మైన్స్, హెడ్‌వర్క్స్ అధికారులు నుంచి నివేదికలు కోరినట్లు ఆమె తెలిపారు. అలాగే జేసీ పి.గన్నవరం అక్విడెక్టుపై నుంచి గోదావరిప్రవాహాన్ని పరిశీలించి పలు అంశాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. డీఎస్‌పాలెంలో ఇసుక ర్యాంపును పరిశీలించి నదీపాయకు ఏవిధంగా అడ్డుకట్టవేశారు, నీటి వేగాన్ని అడ్డుకుంటే ఎదురయ్యే పరిస్థితులు, ఇసుక, తువ్వ మట్టి నిల్వలు ఎంతమేర ఉన్నాయి తదితర అంశాలను పూర్తిస్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వాలని హెడ్‌వర్క్స్, మైన్స్ అధికారులను జేసీ కోరారు. అలాగే మానేపల్లిలంకలో ర్యాంపులను జేసీ పరిశీలించి నివేదిక అందించాలని అధికారులను కోరారు. ఆర్డీవో పి.శ్రీకర్, మైన్స్ ఏడీ ఎల్.వంశీధర్‌రెడ్డి, హెడ్‌వర్క్స్ డీఈ శ్రీనివాస్, జేఈలు నాయుడు, మూర్తి, ఆర్ఐ వి.డాంగే ఉన్నారు.

అవ్వకు అండగా మానవత్వాన్ని చాటుకున్నారు ..

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): అయినవారికి భారమై రోడ్డున పడ్డ ఆ వృద్ధురాలికి ఆటోవాలాలు, పండ్ల వర్తకులు అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్నారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో మానవత్వాన్ని మరిచారు శీర్షికన ప్రచురితమైన వార్తా కథనంతో ఆటో యూనియన్ ప్రతినిధులు, పండ్ల వర్తకులు మరింత చొరవ తీసుకుని ఆమెకు ప్రత్యేక సేవలు అందించారు. కొత్తపేట మండలం మందపల్లి గ్రామానికి చెందిన మద్దింశెట్టి బంగారమ్మ(75)ను అయినవారే అమలాపురం రోడ్డుపై వదిలేశారు. గత కొంత కాలంగా ఆమె ఆలనా పాలనను స్థానిక యూనియన్ ప్రతినిధులే చూస్తున్నారు. మంగళవారం ఆమెకు అయ్యప్పస్వామి ఆలయం వద్ద స్నానం చేయించి నూతన వస్త్రాలు అందించి ఆసుపత్రికి తీసుకువెళ్లారు. మందపల్లి ఎంపీటీసీ సభ్యుడు సిద్ధంశెట్టి వీరవెంకటసత్యనారాయణ రావడంతో వారితో కలిసి యూనియన్ ప్రతినిధులు మట్టపర్తి నారాయణ, కల్వకొలను బాబి, చోడే రాంబాబు తదితరులు బంగారమ్మను కిమ్స్ ఆసుపత్రికి వైద్యసేవల నిమిత్తం తీసుకువెళ్లారు. మూడు నెలల పెన్షన్ సొమ్ము రూ.12వేలును ఆమె స్వగ్రామమైన మందపల్లి ఎంపీటీసీ సభ్యుడు సత్యనారాయణకు అప్పగించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

ముమ్మిడివరం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ అభ్యర్థి డీవీ రాఘవులుకు మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని నేరేడుమిల్లి అబ్బులు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్, ముమ్మిడివరంలోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్, డిగ్రీ కళాశాలలు, పలు విద్యాసంస్థల్లో ప్రచారం నిర్వహించారు. కాశి అప్పారావు, వజ్రపు బాబాయ్ పాల్గొన్నారు.

రాజశేఖర్‌ను గెలిపించాలి

మలికిపురం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను మంచి మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. విశ్వేశ్వరాయపురంలో ఆయన ఇంటి వద్ద జరిగిన సమీక్షా సమావేశంలో దేవ మాట్లాడుతూ నియోజకవర్గంలో 11,366ఓట్లు ఉన్నాయని, ప్రతీ ఓటు రాజశేఖర్‌కు పడేలా కూటమి శ్రేణులు పనిచేయాలన్నారు. మాజీ మంత్రి పీతల సుజాత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు చాలావరకు అమలు చేశామన్నారు. పరిశీలకుడు చిటికెన రామ్మోహనరావు, ప్రాజెక్టుకమిటీ చైర్మన్ గుబ్బలశ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

ముమ్మిడివరం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రజలు మెరుగైన వైద్యసేవలు అందించడంతో పాటు టార్గెట్లను సకాలంలో పూర్తిచేసేందుకు కృషి చేయాలని డీఎంహెచ్‌వో ఎం.దుర్గారావుదొర పేర్కొన్నారు. కొత్తలంక పీహెచ్‌సీలో వైద్యాధికారిణి డాక్టర్ ముకుంద అధ్యక్షతన మంగళవారం జరిగిన ఆశ కార్యకర్తల సమావేశంలో డీఎంహెచ్‌వో మాట్లాడారు. సీహెచ్‌సీలో అమలవుతున్నా వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో వచ్చే కేసుల్లో మధుమేహం, రక్తపోటు, గర్భవతులు, బాలింతలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. ఎంపీహెచ్‌ఈవో ఆర్.రామకృష్ణ, సీహెచ్‌వో కృపాబాయి, పీహెచ్ఎన్ హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు

ముమ్మిడివరం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ విశ్రాంత గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు పితాని వీరవెంకటసత్యనారాయణ ముమ్మిడివరం జడ్పీ బాలికల హైస్కూలులో విద్యార్థినులకు బహుమతులు అందించారు. 6నుంచి 10వ తరగతి వరకు పదమూడు సెక్షన్లలో మొదటి మూడు స్థానాలు సాధించిన 39మంది విద్యార్థినులకు మంగళవారం పలు పుస్తకాలు అందించారు. 40ఏళ్లుగా విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న సత్యనారాయణను హెచ్ఎం సీహెచ్ పరిమళ అభినందించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కాట్రేనికోన, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఆర్‌అండ్‌బీ రహదారిపై గొరగనమూడి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన కాట్రేనికోనకు చెందిన చెళ్ళూరి వెంకటరమణ(44) చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. రమణకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా ఈప్రమాదంలో గాయపడిన లక్ష్మీవాడకు చెందిన ఆకుల ఆదినారాయణ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ అవినాష్ తెలిపారు.

నివేదికలు సిద్ధం చేయాలి: మల్లాడి

యానాం, ఫిబ్రవ 4(ఆంధ్రజ్యోతి): యానాం నియోజకవర్గంలో కేంద్రానికి సంబంధించిన పలు ప్రాజెక్టు పనుల నివేదికలను సిద్ధం చేయాలని ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. పరిపాలనాధికారి కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఢిల్లీ, పుదుచ్చేరి పర్యటనలు ముగించుకుని వచ్చిన మల్లాడి కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోని ప్రాజెక్టులకు సంబంధించి పనులపై చర్చించారు. కేంద్ర ప్రభుత్వ అధికారులు అడిగిన నివేదికలను ఆయా శాఖల వారీగా సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. సమీక్షలో మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, ప్రజాపనులశాఖ అధికారులు పితాని భాస్కరరావు, కాళ్లా నాగరాజు, డిప్యూటీ తహశీల్దారు జ్యోతి వెంకటేశ్వరరావు, మున్సిపల్ ఏఈ కుమార్, కిషోర్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కూటమి నాయకుల ప్రచారం

కాట్రేనికోన, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలంటూ మంగళవారం చెయ్యేరులో గ్రాడ్యుయేట్ ఓటర్లను కలిసి కూటమి నాయకులు కోరారు. టీడీపీ మండల అధ్యక్షుడు నడింపల్లి సుబ్బరాజు ఆధ్వర్యంలో జరిగిన కూటమి నాయకులు ఆకాశం శ్రీనివాస్, వెంట్రు సుధీర్, సర్పంచ్ చెల్లి సురేష్, నంద్యాల వెంకటేశ్వరరావు, విత్తనాల వెంకటరమణ, గిడ్డి చంటిబాబు, బీవీ నారాయణస్వామి, సుంకర నాగేశ్వరరావు, యనమదల బాలాజీ, గుత్తుల సూర్యమహాలక్ష్మీశ్రీనివాస్‌వర్మ, నామా వెర్రిబాబు పాల్గొన్నారు.

శివాలయ పునఃప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభం



క్రాపచింతలపూడిలో శివాలయ పునఃప్రతిష్ఠ పూజలు చేస్తు న్న దృశ్యం

ముమ్మిడివరం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ క్రాపచింతలపూడిలో శ్రీఉమా వల్లభేశ్వరస్వామి శివాలయ పునఃప్రతిష్ఠా మహోత్సవాలు మంగళవారం నుంచి అత్యంత వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. వేదపండితులు బ్రహ్మశ్రీ యలమంచిలి కృష్ణమూర్తి శివాచార్య పర్యవేక్షణలో బాదంపూడి సత్యనారాయణశర్మ, ఉండి సుబ్రహ్మణ్యశర్మ, పుల్లేటికుర్తి సత్యనారాయణశాస్త్రి, పూజ్యం కిశోర్‌శర్మ, ఆలయ అర్చకులు బాదంపూడి దుర్గన్న కుమారుల మంత్రోచ్చారణల నడుమ యాజమాన్యం డాక్టర్ నేమాని జగన్మోహన్, సబిత దంపతులతో పాటు 20మందితో ఆలయ పునఃప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. గణపతి, ఉమాదేవి, వల్లభేశ్వరస్వామి, నంది, కాలభైరవ, దక్షిణామూర్తి, చండీశ్వర, ధ్వజ, నవగ్రహ, ద్వారపాలకులు, శిఖర ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. దేవదాయ ధర్మాదాయశాఖ, దాతలు రూ.1.20కోట్లు సమకూర్చగా ఆలయపునర్నిర్మాణ, ఉపఆలయాల నిర్మాణం జరిగింది. ఆలయ ప్రాంగణం, గ్రామంలో మిరుమిట్లుగొలిపే విద్యుద్దీపాలతో దేవతామూర్తులను ఏర్పాట్లుచేశారు. అధికసంఖ్యలో భక్తులు మహోత్సవాల్లో పాల్గొన్నారు.

'కూటమి కక్ష సాధింపులు'

కాట్రేనికోన, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వైసీపీ కార్యకర్తలు, సానుభూతిపరులపై కూటమి పాలకులు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారంటూ వైసీపీ నాయకులు ధ్వజమెత్తారు. ఎంపీపీ పాలెపు ధర్మారావు నివాసం వద్ద మంగళవారం జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ టీడీపీ నాయకులతో కలిసి కొందరు అధికారులు అరాచకాలు చేస్తున్నారని, వారి తీరు మార్చుకోకపోతే కార్యాలయాల వద్ద టెంట్లు వేసి న్యాయపోరాటం చేస్తామన్నారు. సమావేశంలో నల్లా నరసింహమూర్తి, జడ్పీటీసీ నేల కిశోర్‌కుమార్, సంసాని నాగేశ్వరరావు, నడింపల్లి సూర్యనారాయణరాజు, గంటి వెంకటసుధాకర్, బొమ్మిడి శ్రీనివాస్, మల్లాడి ఆదినారాయణ, బడుగు శ్రీనివాస్, చొల్లంగి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

'పద్మనాభరెడ్డిపై దాడి అమానుషం'

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభరెడ్డిపై దాడి అమానుషమని వైసీపీ సమావేశం వ్యాఖ్యానించింది. దాడిని ఖండిస్తూ పలువురు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం దాడులకు పాల్పడుతోందని, తాము ప్రతిదాడులకు దిగితే పరిస్థితి తీవ్రంగా ఉంటుందన్నారు. సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజ్, నాయకులు దంగేటి రాంబాబు, వంటెద్దు వెంకన్నాయుడు, బొడ్డు నాగేశ్వరరావు, చీకట్ల కిశోర్, సలాది సతీష్, జిన్నూరి వెంకటేశ్వరరావు, వంగా గిరిజానాగకుమారి, కడిమి చిన్నవరాజు, జొన్నాడ శ్రీదుర్గాచిన్ని, చప్పిడి దుర్గారావు, యాళ్ళ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే బడ్జెట్‌లో మునుపెన్నడూ లేనివిధంగా నిధులు

మామిడికుదురు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మునుపెన్నడూ లేనివిధంగా రైల్వే బడ్జెట్‌లో రికార్డుస్థాయి కేటాయింపులు జరిగాయని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు సభ్యులు హాజీ ముఖర్రం హుస్సేన్ పేర్కొన్నారు. రైల్వేశాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్ రాష్ట్ర వ్యాప్తంగా నూతన రైల్వేలైన్ నిర్మాణానికి, మౌలిక వసతుల కల్పనకు, ఆధునికీకరణ పనులకు రూ.84,559కోట్లు విలువైన రైల్వే ప్రాజెక్టులను మంజూరు చేయడం, వాటి అమలుకు రూ.94,1700కోట్ల నిధులు కేటాయించడం అభినందనీయమన్నారు. దీనికిగాను ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీసీఎం పవన్‌కల్యాణ్, టీడీపీ పార్లమెంటరీవిప్ గంటిహరీష్‌మాధుర్‌లకు కోనసీమ ముస్లిం మైనార్టీలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నట్టు ముఖర్రం తెలిపారు.

ఎలక్ట్రికల్ ఈఈ రవికుమార్ బదిలీ

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): అమలాపురం ఎలక్ట్రికల్ ఈఈ రవికుమార్ బదిలీఅయ్యారు. ఆయన స్థానంలో ఆచంటలో డిప్యూటీ ఈఈగా పనిచేస్తోన్న కె.రాంబాబు పదోన్నతిపై అమలాపురం వస్తున్నారు.

కేన్సర్‌ను మొదటి దశలోనే గుర్తించాలి

అంబాజీపేట, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కేన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించడం ద్వారా నివారణకు కృషి చేయవచ్చునని వైద్యాధికారి కేఎస్ శ్రీనివాస్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీ వద్ద ప్రపంచ కేన్సర్ నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ పొగాకు వినియోగం, మాదక ద్రవ్యాలకు బానిసకావడం, ఇతర కారణలతో ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో బి.అప్పారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మండపేట

అభయాంజనేయస్వామి విగ్రహానికి రూ. 1,08,000 విరాళం

కె.గంగవరం, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటిపల్లి పుష్కరాల రేవులో ఏర్పాటు చేస్తున్న అభయాంజనేయస్వామి విగ్రహానికి స్థానిక అగ్నికులక్షత్రియ సంఘం వారు రూ.1,08,000లు విరాళంగా ప్రకటించారు. మంగళవారం అగ్నికుల క్షత్రియ సంఘం పెద్దలు, సర్పంచ్ పెమ్మాడి బేబి, పెమ్మాడి సత్తిబాబులు అభయాంజనేయస్వామి విగ్రహ నిర్మాణ కమిటీకి అందజేశారు.

కోడ్ ఉన్నట్టా.. లేనట్టా..!

• తొలగించని ప్రజాప్రతినిధుల ఫ్లెక్సీలు


గోపాలపురం ప్రధాన రహదారి చెంతనే ఉన్న నాయకుల ఫ్లెక్సీలు

రావులపాలెం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఉన్నతాధికారులు కోడ్‌ను అమలులోకి తీసుకువచ్చారు. కొందరూ స్థానిక అధికారుల నిర్లక్ష్యదోరణి కారణంగా ఎన్నికల కోడ్ పూర్తిస్థాయిలో అమలుకావడంలేదన్న ఆరోపణలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో రావులపాలెం మండలంలోని గ్రామాల్లో ప్రజాప్రతినిధుల ఫ్లెక్సీలను తొలగించడం, ఫ్లెక్సీల మీద నాయకుల ఫోటోలు కనిపించడకుండా కప్పి ఉంచడం చేయాల్సి ఉంది. అలాగే నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాల్సిఉంది. గ్రామాల్లో ఈవిధానం పూర్తిస్థాయిలో అమలు కాకపోవడంతో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోఉన్నట్టా... లేనట్టా.! అనే ప్రశ్నతలెత్తుతుంది.

ఘనంగా రథ సప్తమి పూజలు


వెదురుపాకలో రథ సప్తమి పూజలు చేస్తున్న మహిళ

రాయవరం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని వాడవాడలా రథసప్తమి(భానుసప్తమి) పూజలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. వెదురుపాక విజయదుర్గా పీఠంలో గాడ్ కుమార్తె సత్య వెంకట కామేశ్వరి ఆధ్వర్యంలో మహిళలు సూర్యభగవానుడికి అభిషేకాలు, అష్టోత్తర పూజలు , సౌరహోమం, పూర్ణాహుతి నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మండలంలోని 12 గ్రామాల్లో మహిళలు వేకువజామున పుణ్యస్నానాలు ఆచరించి సూర్య భగవానుడికి రథసప్తమి పూజలు చేయడంతో పాటు పాయసం వండి నైవేద్యం సమర్పించారు. మహిళలు గౌరి నోములు నోచారు.

కపిలేశ్వరపురం: మండలంలో రథసప్తమి వేడుకలను మహిళలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా మహిళలు వేకువజామునే స్నానమాచరించి కాయలు, ఆకులతో రథాన్ని ఏర్పాటు చేసుకుని సూర్యదేవునికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. కోరిన కోర్కెలు తీర్చి పసుపు కుంకుమలతో కళకళలాడుతూ వర్ధిల్లాలని దేవుని ప్రార్థించారు. అనంతరం ఆలయాలను దర్శించి పూజలు చేశారు.

కె.గంగవరం: మండలంలో ప్రజలు మంగళవారం రథసప్తమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మహిళ లు పుణ్యస్నానాలు ఆచరించి భక్తి శ్రద్ధలతో శాస్త్రోక్తంగా పూజలు చేశారు. ఆవుపాలతో క్షీరాన్నం తయారుచేసి సూర్యభగవానుడికి నైవేద్యం పెట్టారు. దేవాలయాలకు వెళ్లి దైవ దర్శనాలు చేసుకున్నారు.

రావులపాలెం: రావులపాలెం మండలంలో రథసప్తమి సందర్భంగా ఆలయాల్లో నిర్వహించిన పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. గ్రామాల్లో భక్తులు రథసప్తమి సందర్భంగా సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలను సమర్పించుకున్నారు.

మహాకుంభమేళాకు బయలుదేరిన ఆర్టీసీ బస్సులు


రావులపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి, రామచంద్రపురం డిపో నుంచి ప్రయాగ్‌రాజ్‌కు బయలుదేరుతున్న బస్సులను ప్రారంభిస్తున్న డీపీటీవో శ్రీనివాసరావు

రావులపాలెం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ఆర్టీసీ డిపో నుంచి ప్రయాగ్‌రాజ్‌లో జరిగే మహాకుంభమేళాకు మూడు ఆర్టీసీ బస్సులు బయలుదేరి వెళ్ళినట్లు డీపో మేనేజర్ రమణ తెలిపారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో మంగళవారం మహాకుంభమేళాకు బయలుదేరుతున్న బస్సులను డీపీటీవో శ్రీనివాసరావు జెండా ఊపి ప్రారంభించారు. భువనేశ్వర్, పూరి, కోనార్క్ దర్శనం అనంతరం మహాకుంభమేళా, త్రివేణి సంగమంలో స్నానం, వారణాశి, గయా, బుద్ధగయా, త్రికూర్మం, అరసవల్లి క్షేత్రాల దర్శనం అనంతరం 12వ తేదీన రావులపాలెం కాంప్లెక్స్‌కు బస్సులు చేరుకుంటాయన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ అచ్యుతాంబా, గరవయ్యనాయుడు, ఆర్టీసీ సిబ్బంది, గ్యారేజీ సిబ్బంది పాల్గొన్నారు.

రామచంద్రపురం డిపో నుంచి..

రామచంద్రపురం(ద్రాక్షారామ): రామచంద్రపురం ఆర్టీసీ డిపో నుంచి మహాకుంభమేళా-అయోధ్యయాత్ర ప్రత్యేక బస్సును మంగళవారం డీపీటీవో ఎం.శ్రీనివాసరావు ప్రారంభించారు. కార్యక్రమంలో రామచంద్రపురం, రావులపాలెం డిపో మేనేజర్లు, డిపో సూపరింటెండెంట్, పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వెంకన్న ఒక్కరోజు ఆదాయం రూ.3.98 లక్షలు


దాతలకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈవో సూర్యచక్రధరరావు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. నోము ఆచరించిన అష్టోత్తర పూజలు, నిత్యకల్యాణాలు నిర్వహించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.3,98,825 లభించినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి పెనుమంట్ర మండలం ఆలమూరుకు చెందిన మల్లిడి వీవీఎస్‌నారాయణరెడ్డి- రాధిక దంపతులు రూ.1,01,116లు విరాళం సమర్పించారు. దాతలకు స్వామివారి చిత్రపటం అందజేశారు.

ప్రమాద బాధితులకు సంజీవ్ పరామర్శ

ఆత్రేయపురం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం నార్కెడిమిల్లికి చెందిన సుమారు 8 మంది రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఆసుపత్రిలో చికిత్స పొందిన వారంతా ఇంటికి చేరుకున్నారు. మంగళవారం ఎమ్మెల్యే బండారు తనయుడు సంజీవ్ నార్కెడిమిల్లిలోని ప్రమాద బాధితుల ఇళ్లకు వెళ్లి పరామర్శించి ప్రమాదానికి సంబంధించిన కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట మాజీ సర్పంచ్ మద్దింశెట్టి వీవీ సత్యనారాయణ, గ్రామశాఖ అధ్యక్షుడు తూము గణేష్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే చర్యలు

రాయవరం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని మండపేట అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కాశి శివనాగ మల్లేశ్వరరావు అన్నారు. మంగళవారం అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఆధ్వర్యంలో బాల కార్మికులను గుర్తించేందుకు కార్మిక, పోలీస్, విద్యాశాఖ, ఐసీడీఎస్, ఎన్జీవోలతో కూడిన బృందం మండలంలోని పలు గ్రామాల్లో వ్యాపార సంస్థలు, హోటళ్లు, ఇటుక బట్టీల్లో తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ మాట్లాడుతూ బాల కార్మికులను పనిలో పెట్టుకున్న వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి పంపి వారికి మంచి భవిష్యత్‌ను ఇవ్వాలన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

• జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు


కపిలేశ్వరపురం: వడ్లమూరులో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు


రాయవరంలో రైతుల సమావేశంలో మాట్లాడుతున్న ఏడీ విశాలాక్షి, గ్రామ వ్యవసాయ సహాయకులతో మాట్లాడుతున్న ఏవో ప్రభాకర్

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): వరి సాగులో యాజమాన్య పద్ధతులు అవలంబించడం ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు అన్నారు. మండలంలోని వడ్లమూరు రైతు సేవాకేంద్రంలో మంగళవారం మండల వ్యవసాయాధికారి కె.వి.ఎస్.రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు, వ్యవసాయ సహాయసంచాలకులు కె.నాగేశ్వరరావులు పాల్గొని మాట్లాడారు. జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు మాట్లాడుతూ వరిలో వచ్చే పురుగులు, తెగుళ్ళు, వాటి లక్షణాలు, నియంత్రణ, పద్ధతులు, కేంద్రప్రభుత్వం ద్వారా అమలవుతున్న ఎన్‌పీఎస్ఎస్ యాప్, తదితర అంశాలపై వివరించారు. సామూహిక ఎలుకల నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా మండలంలోని 17 రైతు సేవాకేంద్రాల ద్వారా బ్రోమోడయోలిన్ మందును రైతులకు ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. సహాయ వ్యవసాయ సంచాలకులు నాగేశ్వరరావు మాట్లాడుతూ రబీపంట ఎరువులు యాజమాన్యం రైతుస్థాయిలో సరైన సమయంలో ఎరువులు ఎంపికచేయడం, అగ్రిస్టాక్ ఫార్మర్ రిజిస్ట్రేషన్, క్రాప్ ఇన్సూరెన్స్, సాయిల్ హెల్త్‌కార్డులు, ఈ పంట ఈకేవైసీ తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామవ్యవసాయ సహాయకురాలు బి.ప్రియాంక, చుండ్రు వీరవెంకటరావుచౌదరి, పుచ్చకాయల రామారావు, పుట్టా వెంకన్నబాబు, గ్రామపెద్దలు, రైతులు పాల్గొన్నారు.

రైతు బజారును సద్వినియోగం చేసుకోవాలి: ఏడీ

రాయవరం: రైతులు పండించిన పంటను దళారులకు కాకుండా నేరుగా వినియోగదారులకు విక్రయించే అవకాశం కల్పిస్తూ ఏర్పాటు చేసిన రైతుబజారును రైతులు, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని మార్కెటింగ్ శాఖ ఏడీ కె.విశాలాక్షి అన్నారు. మంగళవారం రాయవరం రైతు బజారు వద్ద కూరగాయలు పండించే రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏడీ పాల్గొని మాట్లాడారు. రైతులు పండించిన పంటను నేరుగా రైతుబజారుకు తీసుకువచ్చి విక్రయించుకోవచ్చునన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా రాయవరంలో మూతబడిన రైతు బజారును త్వరలో పునఃప్రారంభించనున్నట్లు ఏడీ చెప్పారు. ఏడీ వద్ద కూరగాయలు పండించే కొందరు రైతులు రైతుబజారు వద్ద విక్రయాలు జరిపేందుకు సానుకూలంగా స్పందించారు. రైతుల సమస్యలను ఏడీ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రామచంద్రపురం హార్టీకల్చర్ ఆఫీసర్ ఎం.అనూష, రాయవరం గ్రామాభివృద్ధి కమిటీ ఛైర్మన్ ఉండవిల్లి రాంబాబు, ఎస్ఎంసీ ఛైర్మన్ దేవిశెట్టి చిన్ని, హార్టీకల్చర్ అసిస్టెంట్స్ భవనేశ్వరి, కె.ఐశ్వర్యదేవి, ద్వారపూడి మార్కెట్ కమిటీ సెక్రటరీ పి.సుబ్బరాజు, బి.సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.,

రైతులంతా సామూహిక ఎలుకల నిర్మూలన చేపట్టాలి

రైతులంతా ఒకేసారి ఎలుకల నిర్మూలన చేపడితేనే ఎలుకల నివారణ సాధ్యమని ఎలుకల నివారణ కార్యక్రమం చేపట్టేలా రైతులకు అవగాహన కల్పించాలి మండల వ్యవసాయ అధికారి కె.ప్రభాకర్ గ్రామ వ్యవసాయ సహాయకులకు సూచించారు. మంగళవారం రాయవరం రైతు సేవా కేంద్రంవద్ద 12 గ్రామాలకు చెందిన గ్రామ వ్యవసాయ సహాయకులకు అవగాహన కల్పించారు. ఈసందరభంగా ఏవో మాట్లాడుతూ మండలంలో 14వేల 500 ఎకరాల్లో వరిసాగు జరిగిందని ప్రస్తుతం పంట పిలక దశలో ఉందన్నారు. ఎలుకల నుంచి రైతులు పంటను కాపాడుకునేందుకు ఈనెల 6 నుంచి రైతు సేవా కేంద్రాల్లో ఎలుకల నివారణ మందు పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నట్లు చెప్పారు. ఈకార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏవో పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శివ శంకర్ పాల్గొన్నారు.

దుబ్బుకుళ్లుపై అప్రమత్తంగా ఉండాలి: ఏడీఏ

కె.గంగవరం: రబీ వరి పంటలో దుబ్బు కుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని రామచంద్రపురం ఏడీఏ ఎ.ఎస్.వి. రంగారావు అన్నారు. మంగళవారం శివల గ్రామంలో వ్యవసాయశాఖ ఏవో బలుసు రవి ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. రైతులు నత్రజని వాడకం తగ్గించాలని, పొటాష్‌ను వాడాలని సూచించారు. కార్యక్రమంలో యర్ర పోత వరం డీసీ అధ్యక్షుడు నిడదవోలు సుబ్రహ్మణ్యేశ్వరరావు, కూటమి నాయకులు బలుసు శివప్రసాద్ పాల్గొన్నారు,


కె.గంగవరం: శివలలో రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ

'ఆరోగ్యకరమైన జీవనశైలితో క్యాన్సర్ దూరం'


ఆలమూరు: క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా పెదపళ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్యసిబ్బంది, రావులపాలెం డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం, మండపేట : ద్వారపూడిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

• క్యాన్సర్ నివారణ దినోత్సవం

ఆలమూరు, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): మానవాళిని భయపెడుతున్న క్యాన్సర్ వ్యాధి బారి నుంచి బయటపడాలంటే వ్యసనాలకు దూరంగా ఉండాలని అప్పుడే క్యాన్సర్‌వ్యాధి బారి నుంచి బయట పడవచ్చని పెదపళ్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యులు సువర్చాలాదేవి, సాయికిషోర్‌లు అన్నారు. ఆలమూరు మండలం పెదపళ్లలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో క్యాన్సర్‌డేను పురస్కరించుకుని మంగళవారం ర్యాలీని నిర్వహించారు. క్యాన్సర్‌బారీన పడకుండా తీసుకోవాల్సిన చర్యలు గురించి ర్యాలీలో ప్రజలకు వివరించారు. అనారోగ్యసమస్యలు కనిపిస్తే సత్వరమే వైద్యపరీక్షలు చేయించుకుని వ్యాధి నివారణకు చర్యలు తీసుకోవాలని వారు సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాలు పరిశుభ్రత పాటించాలని వారు కోరారు. కార్యక్రమంలో వైద్యులతోపాటు, వైద్యసిబ్బంది ఏ.వీ.వీ.రాజా, బి.సూర్యనారాయణ, ఎం.శ్రీనివాస రావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో క్యాన్సర్‌పై అవగాహన

రావులపాలెం: రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత ఆధ్వర్యంలో ఎస్ఎంఎఫ్‌జీ గ్రామశక్తి స్థానిక బ్రాంచ్ సహకారంతో ప్రపంచ క్యాన్సర్‌దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ గ్రేస్ పాల్గొని ఆహారపు అలవాట్లు, చెడు వ్యసనాలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. పొగాకు, మద్యపానం, దూమపానం, గుట్కా, మత్తు వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ ఎస్.రాంబాబు, ఎఎస్ఎం డి.భారతి, ఎస్.అరుణకుమార్, అధ్యాపకులు డాక్టర్ సుభాషిణి, కె.రజిని, సౌజన్య, హరిబాబు తదిరులు పాల్గొన్నారు.

మండపేట: మండపేట మండలం ద్వారపూడి పీహెచ్‌సీలో మంగళవారం అంతర్జాతీయ క్యాన్సర్ దినోత్సవంను నిర్వహిం చారు. ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ అనూష సారథ్యంలో ఆసుపత్రి వైద్యసిబ్బంది క్యాన్సర్ గురించి ప్రజలకు ర్యాలీ ద్వారా అవగాహన కల్పించారు. గ్రామంలో క్యాన్సర్ రాకుండా పాటించాల్సిన జాగ్రత్తలు గురించి వారు వివరించారు. డాక్టర్ రత్నకుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్పర్శ కార్యక్రమంలో 10 కొత్త కేసులు గుర్తింపు


ద్రాక్షారామ: వెల్లలో ఆశాల సమావేశంలో మాట్లాడుతున్న మెడికల్ అధికారి వెంకటేశ్వర్లు

ద్రాక్షారామ,ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిర్వహిస్తున్న స్పర్శ కార్యక్రమంలో ఇప్పటివరకు 10 కొత్తకేసులు గుర్తించినట్లు జిల్లా డిప్యూటీ పారా మెడికల్ అధికారి మాధవరపు వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం రామచంద్రపురం మండలం వెల్ల పీహెచ్‌సీలో జరుగుతున్న ఆశాల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గతనెల 20న ప్రారంభమైన కుష్టువ్యాధి అవగాహన గుర్తింపు సర్వే కార్యక్రమం ఈనెల 13 వరకు పొడిగించారన్నారు. సమావేశంలో కుష్టు వ్యాధిగ్రస్తులకు మైక్రో సెల్యులార్ రబ్బర్‌తో తయారుచేసిన పాదరక్షలు డాక్టర్ ప్రసన్న పంపిణీ చేశారు. ఎంపీహెచ్‌వో కె.శ్రీనివాస్, హెల్త్ సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఎంపీహెచ్ఏలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కుష్టువ్యాధిపై అవగాహన కలిగించాలి

కె.గంగవరం: మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని ప్రారంభించి న స్పర్శ ప్రోగ్రాం ద్వారా ఈనెల 13వరకూ గ్రామాల్లో కుష్టువ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ మాధవరపు వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం ఆయన కుందూరు ప్రాథమిక ఆసుపత్రివద్ద స్పర్శ కార్యక్రమంపై అశ వర్కర్‌లతో సమావేశం నిర్వహించారు. ఆశ వర్కర్‌లు ఇంటింటికీ వెళ్లి కుష్టు వ్యాధిపై ప్రజలకు అవగాహన కలిగించి మొదటి దశలోనే గుర్తిస్తే అంగవైకల్యం రాకుండా చూడవచ్చునని అన్నారు. మైక్రో సెల్యూలర్ రబ్బర్‌తో తయారుచేసిన పాదరక్షలు రోగులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు ప్రతాప్, ఆసుపత్రి సిబ్బంది, ఆశవర్కర్‌లు పాల్గొన్నారు.

జెడ్పీహెచ్ఎస్‌లో బీవీసీ విద్యార్థుల సర్వీసు ప్రాజెక్టులు

ద్రాక్షారామ, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ జెడ్పీ ఉన్నత పాఠశాలలో బీవీసీ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ ఫైనల్ విద్యార్థులు రెండు సామాజిక సర్వీసు ప్రాజెక్టులు విజయవంతంగా పూర్తి చేశారు. విజ్ఞానాన్ని పెంపొందించడం, విద్యార్థుల్లో సామర్థ్యం పెంపుదల ప్రాజెక్టుల ద్వారా టీంలీడర్లు చోడిశెట్టి జ్యోతి, పెద్దింశెట్టి అశోక్ తేజలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 450 మందికి శిక్షణ, అవగాహన కల్పించారు. మోటారు వాహనాల మెకానిజం, మెయింటెనెన్స్, లైసెన్సులేకుండా వాహనాలు నడపడంతో కలిగే ప్రమాదాలు, విపత్తు నిర్వహణ, అగ్నిప్రమాద సమయంలో అగ్నిమాపక ఉపకరణాలు వాడే విధానం, ఇంటి అవసరాలకు ప్లంబింగ్, ఎలక్ట్రికల్ ఉపకరణాల మరమ్మతులు కార్యక్రమంలో విద్యార్థులు ఆసక్తిగా పాల్గొని అవగాహన పొందారు. కార్యక్రమంలో హెచ్‌వోడీలు వై.వి.రమణమూర్తి, గ్రైడ్ టీచర్స్ గడ్డి వెంకటేశ్వరరావు, గోపిసాంగి నరసరాజు, హెచ్ఎం సీహెచ్ రత్నావతి, ఒకేషనల్ ఉపాధ్యాయులు రెడ్డికనకరాజు, అరవ విశ్వేశ్వరరావు, జిల్లా సైన్సు అధికారి గిరజాల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

జనార్దనస్వామి కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

• కార్యనిర్వాహణాధికారి కామేశ్వరరావు వెల్లడి



మండపేట, ఫిబ్రవరి4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో రథంగుడిలో ఉన్న శ్రీదేవిభూదేవి సమేత జనార్దనస్వామి తిరుకల్యాణ వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆలయ కార్యనిర్వాహణాధికారి కామేశ్వరరావు తెలిపారు. కల్యాణ ఉత్సవ వివరాలను ఆయన మంగళవారం స్థానిక విలేఖరులకు వివరించారు. ఈనెల 6నుంచి స్వామివారి ఉత్సవాలు ప్రారంభమై 13తో ముగుస్తాయన్నారు. 6న స్వామివారికి పంచామృతాభిషేకం, పెండ్లికూమారుడిని చేయటం, 7న స్వామివారి కల్యాణం, 8న రథోత్సవం, 9న స్వామివారి గరుడసేవ, 10న సదస్యం, 11న నిత్యహోమం బలిహరణ, 12న స్వామివారికి చక్రస్నానం, 13న శ్రీపుష్పయాగం కార్యక్రమాలు జరుగుతాయని కార్యనిర్వాహణాధికారి కామేశ్వరరావు తెలిపారు.

ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించండి

రావులపాలెం,ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలుపునకు పోరాడాల్సిన బాధ్యత అందరిపైన ఉందన్నారు. రావులపాలెం టీడీపీ క్యాంపు పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదేశాలమేరకు యువనాయకులు బండారు సంజీవ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశానికి ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ పరిశీలకులు రాష్ట్ర వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ పొలుపర్తి వెంకటగణేష్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు వాసిరెడ్డి రాంబాబు, టీడీపీ రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు చిలువూరి సతీష్‌రాజు, మండల శాఖ అధ్యక్షుడు గుత్తుల పట్టాభిరామారావు, నరసింహరావు, శ్రీను, శ్రీనివాస్, బాబ్జి, పాల్గొన్నారు.

యువ రచయితకు తెలంగాణ మంత్రి అభినందన


గొడవర్తిని అభినందిస్తున్న తెలంగాణ మంత్రి కొండా సురేఖ

ఆలమూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): నానాటికీ పెరుగుతున్న కాలుష్య కారకాలను అదుపులోపెట్టి పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని యువ రచయిత గొడవర్తి శ్రీనివాస్‌ను తెలంగాణా అటవీ దేవదాయశాఖ మంత్రి కొండా సురేఖ అభినందించారు. జల, వాయు, కాలుష్యం, గ్లోబల్‌వార్మింగ్, నదులు, సముద్రాలు, పర్వతాలు, ప్రకృతి వనరుల విధ్వంసం, ప్లాస్టిక్ కాలుష్యం, తదితర 12 అంశాలపై అవగాహన కల్పిస్తూ హైద్రాబాద్‌కు చెందిన పర్యావరణ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో రూపొందించిన పర్యావరణ క్యాలెండర్‌ను ఆలమూరుకు చెందిన యువ రచయిత గొడవర్తి శ్రీనివాస్ రూపకల్పన చేశారు. హైద్రాబాద్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో మంత్రి సురేఖ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ప్రకృతిని పాడుచేయకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మనంద రిపైనా ఉందని ఆమె అన్నారు. పర్యావరణ క్యాలెండర్‌ను రూపకల్పనచేసిన శ్రీనివాస్‌ను మంత్రి సురేఖ అభినందించారు. కార్యక్రమంలో కొండల్ సృజనా భారతి, కొమ్మూరి ప్రసాద్, ఆలమూరుకు చెందిన గొడవర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వోలకు డీడీవోగా తహశీల్దారు ఉండాలి


తహశీల్దారు ముక్తేశ్వరరావుకు వినతిపత్రాన్ని అందిస్తున్న వీఆర్వోలు

రావులపాలెం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):గ్రామ రెవెన్యూ అధికారులకు గ్రామ పంచాయతీ కార్యదర్శులు డీడీవోగా ఉండటంవల్ల ఇద్దరు మధ్య పలుచోట్ల వివాదాలు తలెత్తుతున్న నేపథ్యంలో గ్రామరెవెన్యూ అధికారులకు డీడీవోగా తహశీల్దారు ఉండేలా చర్యలు తీసుకోవాలని వీఆర్వోలు అధికారులకు వినతిపత్రాలను అం దజేశారు. రావులపాలెం మండల వీఆర్వోల అధ్యక్షులు సీహెచ్ వెంకటేశ్వరరావు, గౌరవా ధ్యక్షుడు కె.లక్ష్మీపతిరావు, ప్రధాన కార్యదర్శి పి.కనకదుర్గ ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రాలను అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామ సచివాలయ ఉద్యోగులను మూడు కేటగిరీలుగా విభజించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు. గ్రామరెవెన్యూ అధికారులందరికీ గ్రేడ్‌లను తొలగించి అందరికీ తహశీల్ధారు డీడీవోగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ వ్యవస్థలను బలోపేతం చేయాలని కోరారు.

గోవిందమాలధారుల దీక్షాధారణ


వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోవిందమాల దీక్ష ధరించిన భక్తులు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గోవిందమాల ధరించిన దీక్షదారులు మంగళవారం దీక్షను ప్రారంభించారు. ప్రతిఏటా మాదిరిగానే గోవిందమాలధారులు దీక్షను నిర్వహించారు. మాలధారులకు దుస్తులు, మాలలు, వసతి, అన్నదానం ఉచితంగా అందిస్తున్నారు. సుమారు 50 మంది స్వాములు దీక్షను ధరించారు. ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు దీక్షదారులకు నూతన వస్త్రాలు అందజేశారు. అనంతరం దీక్షాదారులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి గ్రామోత్సవంలో పాల్గొన్నారు. అర్ధమండలి దీక్ష 21 రోజులు దీక్షను చేయనున్నారు.

ఆటో డ్రైవర్లు నియమ నిబంధనలు పాటించండి

కె.గంగవరం, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా నియ మ నిబంధనలు పాటించాలని పామర్రు ఎస్.ఐ. ఎస్.కె.జానీ బాషా అన్నారు. మంగళవారం ఆయన రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆటోల్లో నిబంధనల ప్రకారమే ప్రయాణికులను ఎక్కించుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, స్కూల్ పిల్లలను తీసుకెళ్లేవారు తక్కువమంది విద్యార్థులతో వెళ్లాలని, పరిమిత వేగంతో వాహనం నడపాలని, ఆటో ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌లు తప్పనిసరిగా ఉండాలని, యూనీఫామ్ ధరించాలని, లైసెన్స్‌లు ఉండాలని సూచించారు. రోడ్డుభద్రత నియమాలు వివరించారు. ఆటోఫిట్‌నెస్‌ను పరిశీలించారు. రికార్డులు తనిఖీలు చేశారు. సరిగా లేనివాటిని వెంటనే సరిచేసుకోవాలని సూచించారు.


ఆటో డ్రైవర్‌ల రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్ఐ జానీబాషా